ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888


Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -295 | పేజీలు - 8 వెల - 03/- | సోమవారం 9 ఫిబ్రవరి 2026

# కేంద్ర పథకాల పురోగతిపై చర్చ

**నేడు సీఎం నేతృత్వంలో మంత్రులు, కార్యదర్శుల భేటీ**

- స్వర్ణాంధ్ర 2047 విజన్, 10 సూత్రాల అమలుపై ప్రధానంగా సమీక్ష
- ఆదాయార్జన శాఖలు, కేంద్ర పథకాల పురోగతిపై చర్చ
- వర్చువల్ విధానంలో పాల్గొననున్న జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు
- 2026-27 ఆర్థిక సంవత్సర లక్ష్యాలపై సీఎం దిశానిర్దేశం



**అమరావతి ఫిబ్రవరి 08( రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్ర పాలన, అభివృద్ధి లక్ష్యాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. సచివాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఈ సుదీర్ఘ సమీక్ష జరగనుంది. ఈ సమావేశానికి మంత్రులు, ప్రభుత్వ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు హాజరుకానుండగా, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్ విధానంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించి, అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. మిగతా 2లో...

# భారత్-మలేషియా బంధానికి తమిళమే వారధి



- భారత్, మలేషియాలను తమిళ భాష కలుపుతోందన్న ప్రధాని మోదీ
- ఇరు దేశాల మధ్య ఆడియో విజువల్ ఒప్పందంపై హర్షం
- మలేషియాలో 12,000 మందితో ప్రధాని మోదీ భారీ సభ
- మలయా యూనివర్సిటీలో 'తిరువళ్లువర్ సెంటర్' ఏర్పాటుకు నిర్ణయం
- మలేషియా ప్రధానికి ఎంజీఆర్ పాటలంటే ఇష్టమన్న మోదీ

2లో.

# రోదసిలోనూ గూఢచర్యం...

- భారత్ కు ఇప్పుడు ఈ సత్తా కూడా ఉంది!
- అంతరిక్షంలో నిఘా సామర్థ్యం సాధించిన భారత్
- అహ్మదాబాద్‌కు చెందిన ప్రైవేట్ సంస్థ ఆజిస్టా అరుదైన ఘనత
- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని ఫొటో తీసిన స్వదేశీ ఉపగ్రహం
- జాతీయ భద్రత, ఉపగ్రహాల రక్షణలో ఇది కీలక ముందడుగు
- భవిష్యత్తులో బాలిస్టిక్ క్షిపణుల ట్రాకింగ్ కూడా సాధ్యం


**ఫిబ్రవరి 08( రిపబ్లిక్ న్యూస్)**
అంతరిక్ష రంగంలో భారత ప్రైవేట్ సత్తా మరోసారి ప్రపంచానికి తెలిసింది. దేశీయంగా అభివృద్ధి చేసిన ఉపగ్రహంతో అంతరిక్షంలోని ఇతర వస్తువులను అత్యంత స్పష్టంగా ఫొటోలు తీసి అహ్మదాబాద్‌కు చెందిన ఆజిస్టా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అరుదైన ఘనత సాధించింది.



మిగతా 2లో...

# బంగ్లాలో హిందువులు ఐక్యంగా పోరాడాలి

- సావర్కర్‌కు భారతరత్న ఇవ్వాలి
- అప్పుడు ఆ పురస్కారానికే ప్రతిష్ఠ
- నాకు 75 ఏళ్లు నిండాయి.. అయినా పదవిలో కొనసాగాలని సంఘ్ చెప్పింది
- ఆదేశిస్తే దిగిపోతా: మోహన్ భాగవత్



**ముంబై, ఫిబ్రవరి 08( రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆదేశిస్తే దిగిపోవడానికి సిద్ధమేనని ఆ సంస్థ చీఫ్ మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. తనకు 75 ఏళ్లు పూర్తయ్యాయని, సాధారణంగా 75 ఏళ్లు దాటాక ఏ పదవిలోనూ లేకుండా పనిచేయాలంటారని, సంఘ్ మిగతా 2లో...

# నేటితో మైకులు కట్

**సాయంత్రంతో మున్సిపల్ ప్రచారం బంద్**

- క్యాంపెయిన్‌లో స్థానిక నేతలదే జోరు
- -పగలు ప్రచారాలు రాత్రి వ్యూహాలు
- పలు జిల్లాల్లో సీఎం మంత్రులు, కేటీఆర్, హరీశ్ సభలు
- మొదలైన తాయిలాలు..ప్రలోభాలు



2లో.

# జిల్లాల మార్పు లేదు

- ఏదైనా అసెంబ్లీలో చర్చించిన తర్వాతే నిర్ణయం
- గత పాలకులు ఫోన్ ట్యాపింగ్‌తో
- వ్యాపారులను బ్లాక్‌మెయిల్ చేశారు
- అలాంటి పాపాత్ములను వదిలిపెట్టం
- సింగరేణి మెడికల్ అన్‌ఫిట్ బోర్డును రద్దు చేస్తాం
- : భూపాలపల్లి సభలో సీఎం రేవంత్ రెడ్డి

**భూపాలపల్లిఫిబ్రవరి 08( రిపబ్లిక్ న్యూస్)**
ఉమ్మడి వరంగల్ జిల్లాకు, తెలంగాణ ఉద్యమానికి విడదీయలేని సంబంధం ఉందని, ఈ ప్రాంతం మేధావులకు, పోరాట యోధులకు పుట్టినిల్లని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం గణపురం మండలం చెల్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన 'ప్రజాపాలన ప్రగతి బాట' బహిరంగ సభకు ఆయనమిగతా 2లో...





# స్టాలిన్, విజయ్‌లతో జగన్

**చెన్నై, ఫిబ్రవరి 08( రిపబ్లిక్ న్యూస్)**
వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీ అధినేత విజయ్‌లను వేర్వేరుగా కలుసుకున్నారు. ఆదివారం చెన్నైలో తన సమీప బంధువు వైఎస్ సునీల్‌రెడ్డి కుమారుడు సాహిల్, మురుగప్పా గ్రూపు సంస్థల అధినేత అరుణాచలం మురుగప్పన్ కుమార్తె వేదిక మెయ్యమ్మైల వివాహానికి జగన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన స్టాలిన్, విజయ్‌లతో జగన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. జగన్ వెంట ఆయన సతీమణి భారతి, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులున్నారు. ఇదే కార్యక్రమానికి హాజరైన సినీనటులు సూర్య, కార్తీ కూడా జగన్‌ను పలకరించారు.

# ఇది దేశానికి బ్లాక్ డీల్

**అమెరికాతో ప్రధాని మోదీ ఒప్పందంపై వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు**

**అమెరికా బ్లాక్ మెయిల్‌కు తలొగ్గి దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆరోపణ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది 'గ్రేట్ డీల్' కాదని, భారతదేశానికి ఇదొక 'బ్లాక్ డీల్' అని అభివర్ణించారు. ప్రధాని మోదీ తీరు 'నామ్ నరేందర్.. కామ్ సరెండర్' (పేరు: నరేందర్... వృత్తి: లొంగిపోవడం) అన్నట్లుగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. మిగతా 2లో...



# దేవరపల్లి గిరిజన ఆశ్రమ హాస్టల్‌లో ఫుడ్ పాయిజనింగ్

- 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి
- ఘటనపై విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని సీఎం హెచ్చరిక
- విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడి

**పోలవరంఫిబ్రవరి 08( రిపబ్లిక్ న్యూస్)**
ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లాలో గల ఓ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో 92 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన మిగతా 2లో...



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:2023/87888



# కేంద్ర పథకాల పురోగతిపై చర్చ

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానంగా 'స్వర్ణాంధ్ర విజన్ 2047'లో భాగంగా నిర్దేశించుకున్న లక్ష్యాలు, పాలనలో పారదర్శకత, సామర్థ్యం పెంచేందుకు రూపొందించిన పది సూత్రాల అమలు పురోగతిపై చర్చించనున్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) వృద్ధి రేటును పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు.ఆదాయాన్ని ఆర్జించే శాఖల పనితీరు, కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై కూడా ఈ సమావేశంలో సమీక్ష జరగనుంది. రాష్ట్రంలోకి వచ్చిన పెట్టుబడులు, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిని సీఎం విశ్లేషించనున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్‌లో భాగంగా అవేర్, డేటా లేక్ వంటి వ్యవస్థల వినియోగం, పాలనలో కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్, ఇతర ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకోవడంపై సీఎం దిశానిర్దేశం చేయనున్నారు.వీటితో పాటు రాష్ట్ర యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం, 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' విధానం అమలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్ర ర్యాంకును మెరుగుపరచడం, శాంతిభద్రతల పరిస్థితిపై కూడా సమీక్షించనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖలు సాధించాల్సిన లక్ష్యాలు, చేపట్టాల్సిన కార్యాచరణపై మంత్రులు, కార్యదర్శులు, జిల్లా స్థాయి అధికారులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనున్నారు.

# రోదసిలోనూ గూఢచర్యం.

(మొదటి పేజీ తరువాయి)

ఈ విజయంతో భారత్‌కు 'ఇన్-ఆర్బిట్ స్నూపింగ్' (కక్ష్యలోనే గూఢచర్యం) చేసే సామర్థ్యం లభించినట్లయింది. అంటే, ఇకపై అంతరిక్షంలో శత్రు దేశాల ఉపగ్రహాలపై నిఘా పెట్టడం సాధ్యమవుతుంది.ఆజిస్టా సంస్థకు చెందిన 80 కిలోల బరువున్న 'సాఖీ=' (ఏబీఏ ఫస్ట్ రన్నర్) ఉపగ్రహం ఈ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. ఫిబ్రవరి 3న భూమికి సుమారు 300 కిలోమీటర్లు, 245 కిలోమీటర్ల దూరంలో పరిభ్రమిస్తున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)ను ఈ ఉపగ్రహం రెండుసార్లు ఫొటోలు తీసింది. మొత్తం 15 ఫ్రేమ్‌లను సేకరించగా, ఇమేజ్ రిజల్యూషన్ దాదాపు 2.2 మీటర్లుగా నమోదైంది. ఈ రెండు ప్రయత్నాల్లోనూ 100 శాతం విజయం సాధించడం, ఆజిస్టా అభివృద్ధి చేసిన స్వదేశీ ట్రాకింగ్ అల్గారిథమ్‌లు, ఎలక్ట్రో-ఆప్టికల్ ఇమేజింగ్ వ్యవస్థల కచ్చితత్వాన్ని నిరూపించింది.ప్రస్తుతం భూ కక్ష్యలో ఉపగ్రహాల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. జామింగ్, సిగ్నల్స్‌కు అంతరాయం కలిగించడం వంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇలాంటి తరుణంలో స్పేస్ సిచువేషనల్ అవేర్‌నెస్ (ఎస్ఎస్ఏ) సామర్థ్యం దేశ భద్రతకు అత్యంత కీలకం. భారత్ ప్రస్తుతం కమ్యూనికేషన్, నావిగేషన్, వ్యూహాత్మక అవసరాల కోసం రూ.50,000 కోట్లకు పైగా విలువైన 50కి పైగా ఉపగ్రహాలను నిర్వహిస్తోంది. ఈ తాజా సామర్థ్యంతో మన అంతరిక్ష ఆస్తులను కాపాడుకోవడం సులభతరం అవుతుంది.'సాఖీ=' ఉపగ్రహాన్ని 2023 జూన్ 13న స్పేస్‌ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ప్రయోగించారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ శాటిలైట్ ఇప్పటికే 2.5 సంవత్సరాల జీవితకాలాన్ని పూర్తి చేసుకుని, మరో 2.5 ఏళ్లు పనిచేయనుంది. ఈ విజయంపై ఆజిస్టా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, "మా స్వదేశీ వ్యవస్థలతో నాన్-ఎర్త్ ఇమేజింగ్‌ను ప్రదర్శించాం. ఇది కక్ష్యలోని వస్తువులను కచ్చితంగా ట్రాక్ చేసే సామర్థ్యాన్నిస్తుంది" అని తెలిపారు.ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రిగేడియర్ అదర్శ్ భారద్వాజ్ మాట్లాడుతూ, "ఈ ప్రదర్శనతో అంతరిక్షంలో కార్యకలాపాలను పర్యవేక్షించే శక్తి భారత్‌కు లభించింది. జాతీయ ఆసక్తులను కాపాడటంలో ఇది కీలక ముందడుగు" అని పేర్కొన్నారు. భవిష్యత్తులో 25 సెంటీమీటర్ల రిజల్యూషన్‌తో ఫొటోలు తీయగల పేలోడ్‌లను అభివృద్ధి చేస్తామని, బాలిస్టిక్ క్షిపణులను ట్రాక్ చేయడం వంటి రక్షణ అవసరాలకూ ఇది ఉపయోగపడుతుందని ఆజిస్టా ప్రకటించింది. ఇస్రో ప్రయోగాలకు అదనంగా, ప్రైవేట్ రంగం సాధించిన ఈ విజయం భారత అంతరిక్ష రక్షణ సామర్థ్యాలను మరింత పటిష్ఠం చేసింది.

# ఇది దేశానికి బ్లాక్ డీల్

(మొదటి పేజీ తరువాయి)

అగ్రరాజ్యం బ్లాక్ మెయిల్‌కు తలొగ్గి, ప్రధాని మోదీ దేశ ప్రజల ప్రయోజనాలను పూర్తిగా తాకట్టు పెట్టారని, ఆయన అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారారని షర్మిల తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఒప్పందం దేశ భవిష్యత్తుకే అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు.

అమెరికా ఉత్పత్తులపై సున్నా సుంకాలు విధించడం ద్వారా భారత మార్కెట్లను వారికి అప్పగించడం, మన స్వదేశీ పరిశ్రమలకు, రైతాంగానికి మరణశాసనం రాయడమేనని షర్మిల దుయ్యబట్టారు.

"మన దేశ ఎగుమతులపై అమెరికా 18 శాతం సుంకాలు తగ్గిస్తే, వారి దిగుమతులపై మోదీ గారు సుంకాలు సున్నా చేయడం ఏంటి? మొన్నటిదాకా మన ఉత్పత్తులపై అమెరికా వేసిన పన్నులు 5 శాతం లోపే. ఇప్పుడు దాన్ని 50 శాతానికి పెంచి, అందులో 18 శాతం కుదిస్తే మనకు ప్రయోజనం ఎలా కలుగుతుంది? దీనివల్ల భారత్‌కు దక్కే ప్రయోజనం కంటే, సున్నా సుంకాలతో అమెరికాకు 100 శాతం లాభం చేకూరుతుంది" అని షర్మిల విమర్శించారు. ఇది భారత రైతుల మెడకు ఉరిపెట్టి, అమెరికా వ్యవసాయానికి మోదీ ఇచ్చిన గ్రేట్ డీల్ అని ఆమె మండిపడ్డారు.

అధ్యక్షుడు ట్రంప్ కోసం ప్రధాని మోదీ "మేక్ ఇన్ ఇండియా" నినాదానికి తిలోదకాలు ఇచ్చారని షర్మిల ఆరోపించారు. "రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ తీసుకుంటే మళ్లీ సుంకాలు 50 శాతం పెంచుతామని ట్రంప్ బహిరంగంగా బెదిరిస్తుంటే ఇది బ్లాక్ మెయిల్ కాదా? ఆ భయంతోనే మోదీ సాగిలపడ్డారు," అని ఆమె వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందాలు ఇరు దేశాల మధ్య సమతూకంగా ఉండాలి కానీ, ఒక దేశానికి నష్టం, మరో దేశానికి లాభం చేసేవాటిని ఒప్పందాలు అనరని అన్నారు.

75 ఏళ్ల భారత వాణిజ్య ఒప్పందాల చరిత్రను మోదీ తుంగలో తొక్కారని, 50 కోట్ల వ్యవసాయ ఆధారిత కుటుంబాల కన్నా అమెరికా ప్రయోజనాలే ఆయనకు ముఖ్యమయ్యాయని విమర్శించారు. ఏటా 100 బిలియన్ డాలర్ల దేశ సంపదను అమెరికాకు అప్పనంగా కట్టబెట్టే కుట్రలో ఈ ఒప్పందం భాగమని ఆరోపించారు. భారత ప్రధాని విదేశం ఎదుట లొంగిపోవడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ప్రధాని మోదీ వెంటనే ఈ 'సరెండర్ అగ్రిమెంట్' పూర్తి వివరాలను బయటపెట్టాలని, కేవలం రెండు మూడు వస్తువుల గురించి కాకుండా అమెరికా నుంచి దిగుమతి కాబోయే అన్ని ఉత్పత్తులు, వాటిపై విధించే పన్నుల వివరాలను జాతికి తెలియజేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

# దేవరపల్లి గిరిజన ఆశ్రమ హాస్టల్‌లో ఫుడ్ పాయిజనింగ్

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విచారణకు ఆదేశించారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం లోగా దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

వివరాల్లోకి వెళ్తే.. పోలవరం జిల్లా రంపచోడవరం మండలం దేవరపల్లిలోని ఆశ్రమ బాలుర వసతి గృహంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) అధికారులతో చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. శనివారం ఉదయం అల్పాహారం తిన్న తర్వాత 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి, జ్వరం, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించాయని అధికారులు సీఎంకు వివరించారు. వెంటనే వారిని మారేడుమిల్లి, రంపచోడవరంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వారు పేర్కొన్నారు.ఘటన జరిగిన వెంటనే హాస్టల్‌ను తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను అంచనా వేశామని అధికారులు తెలిపారు. హాస్టల్‌లో ఉన్న మిగతా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, లక్షణాలు ఉన్నవారికి చికిత్స అందించారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు, ఆహారం, నీటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపినట్లు వివరించారు. ఈ ఘటనపై విచారణకు ఒక జాయింట్ ఇన్స్‌పెక్షన్ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు, అవసరమైతే క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# బంగ్లాలో హిందువులు ఐక్యంగా పోరాడాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశిస్తే తప్పుకుంటానని చెప్పారు. అయితే తనను సంఘ్ కొనసాగాలని చెప్పిందన్నారు. ముంబైలో జరిగిన సంఘ్ శతాబ్ధి ఉత్సవాల కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ-సంఘ్ పరివార్‌లో రిటైర్‌మెంట్‌పై చర్చ జరుగుతున్న సమయంలో భాగవత్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది.అన్ని వర్గాలను పరిగణనలోకి తీసుకుని, ఎలాంటి వివాదాల్లేకుండా ఉమ్మడి పౌరస్మృతి రూపొందించాలని భాగవత్ అన్నారు. మెజార్టీ, మైనార్టీ లేదని, అంతా ఒకటే సమాజమన్నారు. ముస్లిం, క్రైస్తవ సమాజాలతో పరస్పర విశ్వాసం, స్నేహంతో చర్చలు సాగాలన్నారు. జనాభా అసంతులనకు మతమార్పిళ్లు, అక్రమ చొరబాట్లు, జననాల రేటు తగ్గడం కారణమని చెప్పారు. కనీసం ముగ్గురు పిల్లల్ని కనాలని, అయితే ఇది ఆయా కుటుంబాల ఇష్టాన్ని బట్టి ఉంటుందన్నారు. ప్రలోభాలతో పాటు బలవంతంగా మతం మారిన వారిని తిరిగి హిందూమతంలోకి తీసుకువచ్చేందుకు ఘర్ వాపసీ సరైన పరిష్కారమని చెప్పారు. దేశంలో ప్రస్తుతం కులాన్ని రాజకీయ, స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని పేర్కొన్నారు. ఏ కులం వారైనా సంఘ్ చీఫ్ కావొచ్చని భాగవత్ స్పష్టం చేశారు. వందేళ్ల ఆర్ఎస్ఎస్ యువ సంస్థ అని చెబుతూ, కార్యకర్తల సగటు వయసు 28అని, 25కు తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నామని చెప్పారు. దేశ ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు భావిస్తున్నామన్నారు. బంగ్లాదేశ్‌లో 1.25కోట్ల మంది హిందువులు ఐకమత్యంతో పోరాడాలని సూచించారు. వీర్ సావర్కర్‌కు భారతరత్న ఇస్తే దాని ప్రతిష్ఠ పెరుగుతుందని భాగవత్ చెప్పారు. ఈ ప్రతిపాదనపై కాంగ్రెస్ మండిపడింది. సావర్కర్‌కు ఏ ప్రాతిపదికన భారతరత్న ఇవ్వాలని ప్రశ్నించింది

# భారత్-మలేషియా బంధానికి తమిళమే వారధి

**భారత్, మలేషియాలను తమిళ భాష కలుపుతోందన్న ప్రధాని మోదీ**

**కౌలాలంపూర్ ఫిబ్రవరి 08( రిపబ్లిక్ న్యూస్)**

భారత్, మలేషియా మధ్య సాంస్కృతిక సంబంధాలను తమిళ భాష బలంగా పెనవేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇరు దేశాల మధ్య తాజాగా కుదిరిన ఆడియో విజువల్ ఒప్పందం ద్వారా తమిళ చిత్రాలు, సంగీతం మన హృదయాలను మరింత దగ్గర చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కౌలాలంపూర్‌లో మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో కలిసి ఆదివారం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

మలేషియా విద్య, మీడియా, సాంస్కృతిక జీవనంలో తమిళ భాషకు బలమైన, సజీవమైన ఉనికి ఉందని మోదీ ప్రశంసించారు. అంతకుముందు శనివారం జరిగిన 'సెలమత్ దతాంగ్ మోదీజీ' కార్యక్రమంలో 12,000 మందికి పైగా ప్రవాస భారతీయులు, స్నేహితులు పాల్గొన్నారు. ఈ సభకు మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా హాజరయ్యారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ప్రవాస భారతీయ సమాజం మలేషియాలో ఉందని, ఇరు దేశాల ప్రజల హృదయాలను కలిపే అంశాలు చాలా ఉన్నాయని ప్రధాని పేర్కొన్నారు.మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంకు లెజెండరీ నటుడు ఎంజీఆర్ పాటలంటే ఎంతో ఇష్టమని మోదీ గుర్తుచేశారు. బటు కేవ్స్‌లో జరిగిన తైపూసం వేడుకలు, మలేషియాలో గర్బా నృత్యం ప్రాచుర్యం పొందడం మన సాంస్కృతిక బంధానికి నిదర్శనమని అన్నారు. తమిళం ప్రపంచానికి భారత్ ఇచ్చిన గొప్ప బహుమతి అని, తమిళ సాహిత్యం శాశ్వతమైనదని కొనియాడారు. భారత ఉపరాష్ట్రపతి, విదేశాంగ, ఆర్థిక మంత్రులు తమిళనాడుకు చెందినవారేనని ఆయన సభలో ప్రస్తావించారు. ఈ చారిత్రక స్ఫూర్తితో, ఇప్పటికే ఉన్న తిరువళ్లువర్ చైర్‌కు అదనంగా మలయా యూనివర్సిటీలో 'తిరువళ్లువర్ సెంటర్'ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు.

# జిల్లాల మార్పు లేదు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, సింగరేణి కార్మికుల సమస్యలు, గత ప్రభుత్వ వైఫల్యాలపై సీఎం ఘాటుగా స్పందించారు. భూపాలపల్లి జిల్లాను రద్దు చేస్తారంటూ కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీఎం మండిపడ్డారు.రాష్ట్రంలో ఏ జిల్లాను తొలగించే ఆలోచన గానీ, కొత్త జిల్లాల ఏర్పాటు గానీ ప్రభుత్వ పరిశీలనలో లేదని అన్నారు. జిల్లాల పునర్విభజనపై అందరి అభిప్రాయాలు సేకరించి, అసెంబ్లీలో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని అన్నారు. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం కుట్రలు చేసే వారిని గమనించాలని సూచించారు. భూపాలపల్లి జిల్లా ఎక్కడికీ పోదని స్పష్టం చేశారు. నల్లబంగారాన్ని వెలికితీస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న సింగరేణి కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికులకు భారంగా మారిన మెడికల్ అన్‌ఫిట్ బోర్డును రద్దు చేస్తామని ప్రకటించారు. గతంలో డిస్మిస్ అయిన 217 మంది కార్మికుల సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామన్నారు.

వారసత్వ ఉద్యోగాలపై జరుగుతున్న విష ప్రచారాన్ని నమ్మవద్దని, కార్మికుల సంక్షేమమే ఈ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. గత పాలకులు డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో పేదలను వంచించారని రేవంత్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారే తప్ప, పేదల ఇండ్ల గురించి పట్టించుకోలేదని మండిపడ్డారు. వచ్చే బడ్జెట్‌లో రెండో విడత ఇండ్లను కూడా మంజూరు చేస్తామని వెల్లడించారు. 2027లో రాబోయే గోదావరి పుష్కరాల నాటికి బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న తీర ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా మారుస్తామని సీఎం ప్రకటించారు. ఇందుకోసం రూ. 3 వేల నుంచి 4 వేల కోట్లు ఖర్చు చేస్తామన్నారు. జంపన్న వాగు నుంచి రామప్ప చెరువుకు నీళ్లు ఇచ్చే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌తో భార్యాభర్తలు, జడ్జిలు, జర్నలిస్టులు, సినీ తారలను కూడా వదల్లేదని సీఎం ఆరోపించారు. వ్యాపారులను బ్లాక్‌మెయిల్ చేసి వందల కోట్లు దోచుకున్నారని, ఇలాంటి పాపాత్ములను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఆడబిడ్డల ఆశీర్వాదం తమ ప్రభుత్వానికి ఎప్పుడూ ఉండాలని సీఎం కోరారు. ప్రతి ఏటా దసరా పండుగకు మీ తమ్ముడిగా 'ఇందిరమ్మ చీర'ను సారెగా అందజేస్తామని తెలిపారు. అనంతరం మహిళా సంఘాలకు రూ. 205 కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొండా సురేఖ, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు ఐతా ప్రకాష్ రెడ్డి, సిరిసిల్ల రాజయ్య, రాజబాబు, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# నేటితో మైకులు కట్

## సాయంత్రంతో మున్సిపల్ ప్రచారం బంద్

**ఖమ్మం ఫిబ్రవరి 08( రిపబ్లిక్ న్యూస్)**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రంతో ముగియనుంది. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అందుకు 48 గంటల ముందు ప్రచారాన్ని నిలిపివేయాల్సి ఉంటుంది. మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. ప్రచారానికి తక్కువ సమయం ఉండటంతో ప్రధాన రాజకీయ పార్టీల నేతలు జోరుగా ప్రచారంలో పాల్గొన్నారు. అయితే ఈసారి స్టార్ క్యాంపెయినర్లు లేకుండా ప్రచారం ముగుస్తోంది. స్థానిక నేతలే ఎక్కువగా ప్రచారంలో పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాలుగు ఉమ్మడి జిల్లాల్లో సభలు నిర్వహించారు. డిప్యూటీ సీఎం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర మున్సిపల్ కేంద్రానికి పరిమితమయ్యారు.

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కరీంనగర్ మున్సిపాలిటీల బాధ్యత అప్పగించడంతో అక్కడ మాత్రమే ప్రచారం నిర్వహించారు. ఇక మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం కార్పొరేషన్‌తో పాటు అశ్వారావుపేట, ఇల్లందు, ఏదులాపురం, సత్తుపల్లి, కల్లూరులలో రోడ్ షోలు నిర్వహించారు. వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రిగా అక్కడి మున్సిపాలిటీల్లో ప్రచారం నిర్వహించారు. మిగిలిన మంత్రులు సైతం చాలావరకు సొంత జిల్లాలతో పాటు ఇన్చార్జిగా వ్యవహరించిన జిల్లాల్లో ప్రచారం నిర్వహించారు. ఖమ్మం పార్లమెంటు మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జిగా ఉన్న మంత్రి కొండా సురేఖ ఒక్కరోజు ప్రచారానికి మాత్రమే పరిమితమయ్యారు. సీపీఐ జాతీయ నేత నారాయణ ఏదులాపురం, కొత్తగూడెంలలో ప్రచారం నిర్వహించారు.

ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఇతర నేతలు పాల్గొన్నారు. సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, వీరయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు, సాగర్, నున్నా నాగేశ్వరరావు, మల్లు లక్ష్మీ, నాగయ్య, చుక్కారాములు తదితరులు ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాల్గొన్నారు. బీఆర్ఎస్ నుంచి కేటీఆర్, హరీశ్‌రావు రాష్ట్రవ్యాప్తంగా పలు



సభల్లో పాల్గొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడితో పాటు ఎంఐఎం ముఖ్యనేతలూ ప్రచార సభల్లో పాల్గొన్నారు. పగలు బహిరంగ ప్రచారం నిర్వహించిన నాయకులు రాత్రి వ్యూహాలకు పదును పెట్టారు. ప్రతి వార్డు, డివిజన్లలో గడిచిన వారం, పది రోజులుగా ఎన్నికల ప్రచార మైకులతో పట్టణ ప్రజలు నిద్రలేచారు. ఇప్పటివరకూ ఎన్నికల ప్రచార మోతను భరించగాడ ఓటర్లను ప్రలోభ పెట్టే చర్యలూ మొదలయ్యాయి.కాలనీల్లో ప్రచార రథాలు మైకులతో హోరెత్తించాయి. ఒక పార్టీ రథం ఓ వీధిలో తిరుగుతుండగానే మరో పార్టీ రథం మరో వీధిలో మోత మోగిస్తున్న తతంగం వారం రోజులుగా నడిచింది. ఇన్ని రోజులు పార్టీల జిల్లా నేతలు ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలనీలను చుట్టేస్తూ హడావుడిలో ఉన్నారు. ప్రచారంలో పాల్గొంటూనే మెజార్టీ సీట్లలో గెలుపునకు ఏమి చేయాలనేదానిపై రాత్రిళ్లు వ్యూహానికి పదును పెట్టారు. ప్రధాన పార్టీలన్నీ పుర పీఠంపై గురిపెట్టి అన్ని స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దించడంతో ఎన్నికలు రసవత్తరంగా మారాయి. తమ అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్, తమ వారికి ఓటేస్తే కేంద్ర నిధులు వస్తాయని బీజేపీ, తమ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ఆదరించాలని బీఆర్ఎస్ నేతలు ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నించారు. కాంగ్రెస్ తరపున ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ కాలనీల్లో పర్యటించారు.


ఇప్పటికే ప్రలోభ చర్యలు మొదలయ్యాయి. ఏ వార్డులో పరిస్థితి ఎలా ఉందనేది ఆరా తీశారు. బలహీనంగా ఉన్న చోట ఎవరితో మాట్లాడితే ప్రయోజనకరంగా ఉంటుందనే దానిపై సమాలోచనలు చేశారు. వాటిని ఆచరణలో పెడుతున్నారు. కాలనీ ముఖ్య వ్యక్తులకు ఫోన్లు చేస్తూ తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. వార్డుల్లో ఉండే సామాజికవర్గాల్లో ముఖ్యమైన వారితో మాట్లాడుతూ మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తానికి అన్ని పార్టీలూ మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో అర్ధరాత్రి వరకు సైతం అనధికారిక ప్రచారం నిర్వహించారు. ఈ రెండు రోజులు పగలూ రాత్రుళ్లు నిద్ర లేకుండా ఓటర్లను ఆకట్టుకునేందుకు రకరకాల ప్రలోభాలు చేపడుతున్నారు.

ప్రజా రిపబ్లిక్

సోమవారం 9 ఫిబ్రవరి 2026

# పదో తరగతే భవిష్యత్తుకు పునాది

**ప్రణాళికతో చదివితే విజయం ఖాయం బీసీ సంక్షేమాధికారి ప్రసూన**




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 8)** విద్యార్థుల జీవితంలో పదో తరగతి అత్యంత కీలకమైన దశ అని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ప్రసూన అన్నారు. కర్నూలు డివిజన్ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన ప్రేరణ తరగతుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి, కష్టపడి శ్రమిస్తే తప్పకుండా మంచి మార్కులు సాధించగలరని ఆమె తెలిపారు.రాజ్‌విహార్ సర్కిల్ సమీపంలోని అంబేద్కర్ భవన్‌లో వసతి గృహాల్లో నివసిస్తూ చదువుతున్న పదో తరగతి విద్యార్థులు, విద్యార్థినీల కోసం ఈ ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా నిపుణులు వివిధ అంశాలపై ఉపన్యాసాలు ఇచ్చి, పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలో విలువైన సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వసతి గృహాల అభివృద్ధి అధికారి పాలేగార్ సత్యనారాయణ రాజు, శైలజ, గిరిజాదేవి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత బస్సు సదుపాయం

**శ్రీశైలం ఫిబ్రవరి 8 ( రిపబ్లిక్ న్యూస్)**



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు క్షేత్రానికి చేరుకుంటున్నారు.
భక్తులు సౌకర్యార్థం వారు దిగినచోటు నుంచి ఆయా ప్రదేశాలు వెళ్ళేందుకు దేవస్థానం ఉచిత బస్సు సదుపాయాన్ని కల్పించింది. ఈ బస్సులు కైలాసద్వారం నుండి శ్రీశైలం వరకు నడపబడుతున్నాయి. అదేవిధంగా నందిగుడి సర్కిల్ నుంచి ప్రారంభమై గణేశసదన్, సెంట్రల్ పార్కింగ్, విభూతిమఠం జంక్షన్, మల్లమ్మకన్నీరు, శివాజీస్ఫూర్తికేంద్రం, రుద్రాపార్కు, సిద్ధరామప్పకొలను, పాతాళగంగరోడ్డు, ప్రైవేటు సత్రాల మీదుగా మరల నందిగుడి సర్కిల్‌కు చేరుకుంటాయి. కాగా భక్తులరద్దీని బట్టి ఈ రోజు నాలుగు బస్సులు నడపబడుతున్నాయి. రేపు కూడా నాలుగు బస్సులను నడపడం జరుగుతుంది. అదేవిధంగా ఈ నెల 10 మరియు 11ఈ తేదీలలో రోజుకు ఎనిమిది బస్సులు నడపబడుతాయి. అలాగే 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు రోజుకు 10 బస్సులను నడపడం జరుగుతుంది.

# ఫిబ్రవరి 22న విజయవాడలో బీసీ సింహగర్జన మహాసభ

**మహాసభను జయప్రదం చేయాలని పిలుపు -కర్నూలులో పూలే సర్కిల్ వద్ద వాల్ పోస్టర్ ఆవిష్కరణ**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 8)**
మంగళగిరిలోని బీసీవై పార్టీ కేంద్ర కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 22న విజయవాడలో నిర్వహించనున్న బీసీ సింహగర్జన మహాసభను విజయవంతం చేయాలని బీసీవై పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పీఏసీ కమిటీ సభ్యులు పాల రమేష్ యాదవ్ పిలుపునిచ్చారు.
ఆదివారం కర్నూలు నగరంలోని పూలే సర్కిల్ వద్ద పాల రమేష్ యాదవ్ అధ్యక్షతన బీసీ సింహగర్జన మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జి. అయ్యన్న యాదవ్, బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ నాయకులు జే. శ్రీనివాసులు, వాల్మీకి ఉద్యమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ నాయుడు పాల్గొన్నారు.
అలాగే వాల్మీకి సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్ నాయుడు, ఆంధ్ర రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చనగంటి సాంబమూర్తి, రాష్ట్ర



సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ కుమ్మర గిరిబాబు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కంది వరుణ్ కుమార్ యాదవ్, రాచ కౌలుట్ల యాదవ్, వాల్మీకి కర్నూలు జిల్లా కన్వీనర్ ఎల్లర్తి అర్జున్, కర్నూలు జిల్లా యూత్ కన్వీనర్ కప్పట్రాళ్ల మధు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఫిబ్రవరి 22వ తేదీన నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా ఉన్న మైదానంలో నిర్వహించనున్న బీసీ సింహగర్జన మహాసభకు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతి ఒక్క బీసీ బిడ్డ పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. బీసీల ఐక్యత, ఆత్మగౌరవం, హక్కుల సాధనే లక్ష్యంగా ఈ మహాసభ జరగనుందని తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎన్ఎండి ఫిరోజ్

**నంద్యాలఫిబ్రవరి 8 (రిపబ్లిక్ న్యూస్)**
నంద్యాల నియోజకవర్గంలో మంత్రి ఫరూక్ తనయుడు నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ప్రజలకు నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు. ప్రజలు ఆపద సమయాల్లో అందించే మెడికల్ రీయంబర్స్మెంట్ ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్దిదారులకు ఈరోజు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు 54 మంది లబ్ధిదారులకు 29 లక్షల రూపాయలు పంపిణీ చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ వ్యాప్తంగా 29 లక్షల రూపాయలు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధ్యత కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని తెలిపారు . కూటమి ప్రభుత్వం అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న లబ్ధిదారులకు ఆర్థికంగా ఆదుకునేందుకు సహాయ నిధిని అందిస్తున్నట్లు తెలిపారు . నంద్యాల టౌన్ , నంద్యాల మండలం మరియు గోస్పాడు మండల ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించారు . ముఖ్యమంత్రి సహాయ నిధిని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రులు నారా లోకేష్ , ఎన్ఎండి ఫరూక్ లతో పాటు ఫిరోజ్ , ఫయాజ్ లకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్ , గోస్పాడు మండల టిడిపి కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి , నంద్యాల మండల కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, కౌన్సిలర్లు కండే శ్యాం సుందర్ లాల్, జైనాభి, షేక్ మున్న మరియు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# పవిత్ర రంజాన్ మాసంలో పుణ్యాలను మూట కట్టుకోండి

**అన్ని మాసాలలో కెల్లా పవిత్రమైన మాసం రంజాన్ మాసం**

**జమాతుల్ ఉలేమా వయిమ్మ పౌండేషన్ ఆద్వర్యంలో రంజాన్ ధార్మక, సమాజసేవపై బహిరంగ సభ**

**ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి జిల్లా కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్**




**నంద్యాల ఫిబ్రవరి 8 ( రిపబ్లిక్ న్యూస్)**
పవిత్ర రంజాన్ మాసంలో పుణ్యాలను మూట కట్టుకోవాలని, అన్ని మాసాలలో కెల్లా పవిత్రమైన మాసం రంజాన్ మాసమని మత పెద్దలు, ఉలేమాలు బోధించారు. జమాతుల్ ఉలేమా వయిమ్మ పౌండేషన్ ట్రస్ట్ ఆద్వర్యంలో రంజాన్ ధార్మక, సమాజసేవపై నంద్యాల పట్టణ మున్సిపల్ టౌన్ హాల్ నందు భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభకు హైదరబాదుకు చెందిన హజరత్ మౌలానా గయాస్ అహ్మద్, సఫ బైతుల్ మాల్, బెంగళూరుకు చెందిన మాలానా హుమాయాన్ ఖాన్ సాహెబ్ లతో పాటు టిడిపి జిల్లా కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనియార్ ఖలీల్, నంద్యాల ముస్లిం జేఏసీ నాయకులు అబులైజ్, అబ్దుల్ సమద్, బిల్డర్ అబ్దుల్లాతో పాటు జమాతుల్ ఉలేమా వయిమ్మ పౌండేషన్ కమిటీ సభ్యులు మౌలానా హుస్సేన్ సాహెబ్ రషాది, మౌలానా ఇద్రిస్ సాహెబ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రంజాన్ యొక్క పవిత్రత, రంజాన్ మాసంలో నిర్వహించే ఉపవాసాల వల్ల కలిగే లాభాలు అలాగే ప్రవక్త యొక్క నడవడిక, రంజాన్ మాసంలో ఆయన అనుసరించిన విధానాలు తదితర వాటిని విపులంగా వివరించారు. ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ నెలలో ఉపవాసాలు ఎలా ఉండాలి, ఎటువంటి నియమాలు పాటించాలి, ప్రవక్త అనుసరించిన ఉదాహరణలతో సహా వివరించారు. తాము బాగుండడమే కాకుండా తమ పొరుగు వారికి కూడా సహాయం చేయాలన్న గుణం ప్రవక్త నుండి పలువురు ప్రవక్తలు ఆచరించారని, వాటిని ముస్లిం సమాజం ఆచరించాలని వారు పేర్కొన్నారు. సమాజసేవ కోసం చేయాల్సిన పనులు, వాటి అమలుపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలు కూడా పెద్ద



సంఖ్యలో హాజరయ్యారు.
ఈ కార్యక్రమంలో హాఫిజ్ షరీఫ్ సాహెబ్, హఫీజ్ కరీముల్లా సాహెబ్, హఫీజ్ అబ్దుల్ వహీద్ సాహెబ్, హఫీజ్ షబ్బీర్ సాహెబ్, ఖాజీ నూర్ అహ్మద్ సాహెబ్, బండి ఆత్మకూరు ఖాజీ షఫీఉల్లా నూరి, గవర్నమెంట్ ఖాజీ ముఫ్తీ షఫీఉల్లాసాబ్, హఫీజ్ మహబూబ్ బాషా సాహెబ్, హాఫిజ్ షరీఫ్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# బోయకొండలో కొనసాగిన యాత్రికుల రద్దీ

**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 08 రిపబ్లిక్ న్యూస్**



అన్నమయ్య జిల్లా, చౌడేపల్లి మండలం లోని శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. రాష్ట్రం తో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కొండ దినాన్ని పురస్కరించుకొని ఉదయాన్నే ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో విశేష అభిషేకము అలంకరణ నిర్వహించారు మధ్యాహ్నం వరకు క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి.ఆలయ ఈవో ఉపక కమిషన్ ఏకాంబరం అధికార అర్చక సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.

# ఆర్డీటీ కోసం ఐక్య ఉద్యమాలు చేద్దాం

**నేడు కలెక్టర్ కార్యాలయంకు తరలిరండి**

**అనంతపురం సంక్షేమం,**
**ఫిబ్రవరి 08,(రిపబ్లిక్ న్యూస్):**



పేద ప్రజలకు సేవలు చేస్తున్న ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరికి ఉందని ఆర్డీటీ పరి రక్షణ జేఏసీ కన్వీనర్ సాకే హరి అన్నారు.ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందున్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి ఆర్డీటీ పరి రక్షణ కమిటీ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

**విదేశీ నిధులు రాకుండా నిలుపుదల చేయడం అన్యాయం**

అనంతరం నాయుకులు సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు,వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక కే వి రమణ,బహుజన సమాజ్ పార్టీ హరి ప్రసాద్.కుల వివక్షత పోరాట సమితి వెంకటేష్,సీపీఐ ఎం,ఎల్ లిబరేషన్ వేమన,ఎమ్మార్పిఎస్ కుంటి మద్ది ఓబులేష్,డాక్టర్ అక్కులప్ప,ఎస్సీ,ఎస్టీ ఫోరమ్ నెరమెట్ల ఎల్లన్న,మాల మహానాడు సుగమంచి శ్రీనివాసులు,ఎస్సీ జన సంఘం దాసగాని పల్లి కుళ్లాయప్ప,లౌకిక రాజ్య పరి రక్షణ సమితి మందల రమేష్,గిరిజన ప్రజా సంక్షేమ సంఘం గర్మ మల్ళీ కార్జున నాయక్,బేడా బుడుగ జంగం శిరిశాల అంజి,పూసల సంఘం హనుమంతు,రజక సంఘం ఈశ్వరయ్య,దివ్యాంగుల హక్కుల పోరాట సమితి హరి నాథ్ రెడ్డి,నవ యువ సమైక్య విశ్వనాథ్ మాట్లాడుతూ 1969నుండి ఆర్డీటీ ఉమ్మడి జిల్లాలో పేద ప్రజలకు అన్ని రంగాలోను ఎన్నో సేవ లందించిన సంస్థను కాపాడుకుందామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ విదేశీ నిధులు రాకుండా నిలుపుదల చేయడం అన్యాయమన్నారు.ఆర్డీటీ పరి రక్షించు కోవాడానికి ఇప్పటికే అనేక రకాలుగా అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు, ఉద్యమాలు చేసిన్నప్పటికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కరుణించలేదన్నారు. ఎఫ్ సి ఆర్ ఏ రిజస్ట్రేషన్ వెంటనే చేయాలని నేడు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ గారికి ప్రజా సమస్యల పరిస్కార వేదికలో వినతి పత్రం ఇవ్వడానికి అన్ని రాజకీయ,వామపక్ష పార్టీలు కుల ప్రజా సంఘాలు,అభ్యుదయ ప్రజాసామిక వాదులు,ఆర్డిటి అభిమానులు తరలి రావాలని పిలుపునిస్తున్నాము. కార్యక్రమంలో నాయకులు రమణయ్య,భీమ్ సేన రావ్, రామకృష్ణ,శివ,ముత్యాలు,సూర్యనారాయణ,ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి పండుగకు సంబంధించి భక్తులకు/పాదాచారులకు పోలీసు వారి సూచనలు

**ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్**



**నంద్యాల క్రైం, ఫిబ్రవరి 8, (రిపబ్లిక్ న్యూస్):** మహాశివరాత్రి పండుగ సందర్భముగా, ఆత్మకూరు నుండి దోర్నాల ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ ను నియంత్రించుట కొరకు, నేటి (సోమవారం) నుండి కర్నూలు నుండి విజయవాడ వైపు వెళ్ళు భారీ గూడ్స్ వాహనములను దోర్నాల మీదుగా అనుమతించబడవు. సదరు భారీ వాహనములు నంద్యాల మీదుగా వెల్లవలెను. అదే విధముగా విజయవాడ నుండి కర్నూలు వైపు వచ్చే భారీ గూడ్స్ వాహనములు దోర్నాల - ఆత్మకూరు మీదుగా అనుమతించబడవు. సదరు వాహనములు గిద్దలూరు, నంద్యాల మీదుగా వెల్లవలెను. శ్రీశైలంకు కాలినడకన వెళ్ళు భక్తులు రోడ్డుకు ఒక వైపున మాత్రమే వెల్లవలెను. పాదచారులు జేబుదొంగల పట్ల అప్రమత్తముగా ఉంటూ, వారి యొక్క వస్తువులను, లాగేజీ ని జాగ్రత్త చూసుకొనవలెను. గూడ్స్ వాహనముల యందు మనుషులు అనుమతించబడరు, వాహనాల యందు ప్రయాణికులు పరిమితికి మించి ప్రయాణించరాదు. వాహన దారులు నిర్దేశించిన వేగముతో వెల్లవలెను. అతివేగముతో ప్రయాణించరాదు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, పోలీసు వారికి సహకరించవలెను. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన యెడల మోటార్ వాహనాల చట్టప్రకారం చర్య తీసుకొనబడును. వాహన డ్రైవరులు మద్యం సేవించి వాహనాలను నడపరాదు. వెంకటాపురం వరకు వాహనములలో వచ్చి, కాలినడకన వెళ్ళు భక్తులు, వారి యొక్క వాహనములను రోడ్డు పై ఎక్కడ పడితే అక్కడ నిలిపి వేయకుండా, వెంకటాపురం వద్ద వారికి కేటాయించిన పార్కింగ్ ప్రదేశం నందు ఒక క్రమపద్ధతిలో పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్ కి అంతరాయం కలగకుండా పోలీసు వారికి సహకరించవలెను. చిన్నపిల్లలతో పాటు కాలినడకన వెళ్ళే వారు, పిల్లల పట్ల అప్రమత్తంగా ఉంటూ, వారు తప్పిపోకుండా చూసుకోవలెను. భక్తులు అడవిలో ప్రయాణించేటప్పుడు అటవీ పరిసరాలకు ఎటువంటి హాని తలపెట్టరాడు. భక్తులు అటవీ మార్గములో ప్రయాణించేటపుడు వన్య ప్రాణులకు హాని తలపెట్టకుండా, జంతువుల నుండి అప్రమత్తముగా ఉండవలెను. అటవీ మార్గములో ప్లాస్టిక్ వస్తువులు అనుమతించబడవని డీఎస్పీ రామాంజి నాయక్ ఆదివారం తెలిపారు.

## విలేకరులతో కలిసి బాధితుడు
# పోలీసులకు ఫిర్యాదు



**బండి ఆత్మకూరు, ఫిబ్రవరి 8, (రిపబ్లిక్ న్యూస్):-** బండి ఆత్మకూరు మండలంలోని టుడే టీవీ రిపోర్టర్ ఎం.ఆంజనేయులుపై భౌతిక దాడి చేసిన టిడిపి మండలాధ్యక్షుడు ముమ్మడి నాగకృష్ణారెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని మండల జర్నలిస్టులు డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆదివారం బాధిత రిపోర్టర్ ఆంజనేయులు, సహచర పాత్రికేయులతో కలిసి బండి ఆత్మకూరు ఏఎస్ఐ అక్బర్‌కు ఫిర్యాదును అందజేశారు.పరమటూరు సహకార సొసైటీలో యూరియా పంపిణీ సక్రమంగా జరగడం లేదని ఆంజనేయులు తన యూట్యూబ్ ఛానల్లో ప్రసారం చేసిన వీడియో కథనాన్ని జీర్ణించుకోలేక, శనివారం మధ్యాహ్నం ఓ పథకం ప్రకారం విచారణ పేరుతో సొసైటీకి పిలిపించి, నోటితో చెప్పలేని విధంగా దుర్భాషలాడి, దాడి చేయడంతో ముఖం వాసి కన్ను ఎర్రబడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఘటనపై తక్షణమే కేసు నమోదు చేసి, దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధితుడు ఆంజనేయులుతో పాటు ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ నంద్యాల జిల్లా కన్వీనర్ పిట్టం నాగవర్ధన్ రెడ్డి, బండి ఆత్మకూరు మండల విలేకరులు కొండయ్య, జమాల్, నాగరాజు, ఇస్మాయిల్,నాగ కాంత్ రెడ్డి, దస్తగిరి, సుబ్బయ్య, చంద్రబాబు, చాంద్ బాషా, శ్రీనివాసులు,పూల వెంకటసుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

## మాదారం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**హత్నూర :08 ఫిబ్రవరి26 ( రిపబ్లిక్ న్యూస్)**

మాదారం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన గౌరవనీయులు శాసనసభ్యులు సునీత లక్ష్మారెడ్డి గారు డ్వాక్రా గ్రూప్ మహిళ భవనానికి ఇంకా మరిన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షులు రామచంద్ర రెడ్డి గారు మరియు నరసింహారెడ్డి మరియు మాజీ ఎంపీపీ నర్సింహులు మరియు మాజీ జెడ్పిటిసి ఆంజనేయులు వెంకట గారి నరసింహులు గమాదారం సర్పంచ్ నవీన్ గౌడ్ గారు మరియు ఉప సర్పంచ్ సువర్ణ గారు గ్రామ ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు



# స్కీంలు లెవు అన్ని స్కాంలే.
### మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్)





**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 8 ( రిపబ్లిక్ న్యూస్ )**

రేవంత్ రెడ్డి అబద్ధపు 6 గ్యారంటీల హామీలతో గెలిచి స్కీములేవు అన్ని స్కాములే అని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మండిపడ్డారు. ఒక జాబ్ క్యాలెండర్ లేదు గాని క్యాలెండర్ మాత్రం చేసిందన్నారు. ఈ మున్సిపల్ ఎలక్షన్ లో 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి రొయ్యల నాగరాణి సత్యం కారు గుర్తుకు ఓటు వేసి మీరు గెలిపించాలని ఆయన గ్రామ ప్రజలకు తెలియజేశాడు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అభ్యర్థి రొయ్యల నాగరాణి సత్యం, రొయ్యల శేఖర్, దాసరి మల్లేశం, కుమ్మరి అశోక్, ఎలగోరి నరేష్, ఆది అశోక్, లక్ష్మి కాంత్ రెడ్డి, తాలుక లక్ష్మణ్, తుడుం పోచయ్య, తుడుం రాజు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జోగిపేట గడ్డమీద గులాబీ జెండా ఎగిరేస్తాం.
### బిఆర్ఎస్ పార్టీ నేరడి గుంట అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి.



**ఆందో నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 8( రిపబ్లిక్ న్యూస్)**

అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో ఈసారి గులాబీ జెండా ఎగరేస్తామని బిఆర్ఎస్ మండల యువజన నాయకుడు నేరేడు గుంట గ్రామ అధ్యక్షుడు మిద్దెన శ్రీధర్ రెడ్డి భీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జోగిపేట ఒకటో వార్డు అభ్యర్థి చక్రపాణికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశాడు . స్థానికంగా ఉంటూ ప్రజల సమస్యల మీద అవగాహన ఉన్న వ్యక్తి చక్రపాణి అని ఆయన అన్నారు. బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి చక్రపాణి రంగంలోకి దిగిన వెంటనే గెలుపు ఎప్పుడూ డిసైడ్ అయిందని శ్రీధర్ రెడ్డి ఆశ భవం వ్యక్తం చేశాడు. ఈ కార్యక్రమంలో చంటి రాహుల్ కిరణ్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# విస్తరణలో గుర్తించబడని ఆస్తిదారులు ముందుకు రావాలి

**ఎన్‌హెచ్340సి రహదారి విస్తరణకు యాజమాన్య పత్రాలతో మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించండి కమిషనర్ పి.విశ్వనాథ్**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 8)**

నగరంలోని శ్రీ దామోదరం సంజీవయ్య సర్కిల్ నుండి ఎస్ఎస్ గార్డెన్స్ వరకు జాతీయ రహదారి340సి విస్తరణ పనులు వేగవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో, విస్తరణలో భాగంగా ప్రభావితమైన కొన్ని ఆస్తుల యాజమాన్య వివరాలు గుర్తించబడని పరిస్థితి నెలకొన్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ తెలిపారు.రహదారిని 100 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయనున్న నేపథ్యంలో, ప్రభావిత ఆస్తిదారులకు బదిలీ చేయగల అభివృద్ధి హక్కులు (టిడిఆర్‌లు) మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందని ఆయన వెల్లడించారు. అయితే కొన్ని భూములు, ప్లాట్లకు సంబంధించిన యాజమాన్య వివరాలు పూర్తిగా అందుబాటులో లేకపోవడంతో, సంబంధిత యజమానులు లేదా వారి చట్టబద్ధ వారసులు తమ టైటిల్ డీడ్లు, అవసరమైన పత్రాలతో నగరపాలక సంస్థ కార్యాలయాన్ని వెంటనే సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

ఇంకా సమ్మతి పత్రాలు సమర్పించని ఆస్తిదారులు తక్షణమే వాటిని అందజేయాలని, ఇప్పటికే సమ్మతి ఇచ్చిన వారు నిబంధనల ప్రకారం గిఫ్ట్ డీడ్ నమోదు పూర్తి చేసి అనంతరం టిడిఆర్ బాండ్లు పొందవలసిందిగా ఆయన సూచించారు.

నిర్దేశిత గడువు లోగా క్లెయిమ్‌లు లేదా అవసరమైన పత్రాలు అందని పక్షంలో, నియమ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని కమిషనర్ పి. విశ్వనాథ్ స్పష్టం చేశారు.

**యాజమాన్యం గుర్తించబడని ప్రభావిత భూములు / ప్లాట్లు**

**జోహరాపురం గ్రామం:**

సర్వే నం.109 ప్లాట్ నంబర్లు: 19, 26, 27, 28, 30, 31, 32, 109, 110, 111, 112, 113, 114, 148, 149, 150, 151, 152
సర్వే నం.114 ఖాళీ స్థలం
సర్వే నం.100 ప్లాట్ నంబర్లు: 9, 10
సర్వే నం.106/1, 106/2 ఖాళీ స్థలం
సర్వే నం.117 ఖాళీ స్థలం
సర్వే నం.135 ప్లాట్ నంబర్లు: 53, 54, 55, 56

కల్లూరు గ్రామం:

సర్వే నం.663/బి, 669/బి ప్లాట్ నంబర్లు: 1, 5, 31
సర్వే నం.660/సి ప్లాట్ నంబర్లు: 11, 12, 26, 27, 36, 42
సర్వే నం.664/బి ప్లాట్ నంబర్లు: 1, 2, 3, 4, 26, 29
సర్వే నం.663/ఎ ప్లాట్ నంబర్లు: 168, 176
సర్వే నం.661/బి ప్లాట్ నంబర్లు: 1, 2, 3, 4, 5

# అనంత యువత ఉదారత

**శ్రీశైలంలో నడకమార్గ భక్తులకు అన్న పానీయాలు**

**ఎస్ ఆర్ ఎమ్ బిల్డర్స్ అధినేత శివారెడ్డి ఆధ్వర్యంలో భారీ విరాళం -ఏకంగా 1.5 కోట్లతో స్వయం ఏర్పాట్లు**

**అనంతపురం ఆధ్యాత్మికం, ఫిబ్రవరి 08,(రిపబ్లిక్ న్యూస్):**

శ్రీశైలం మహా క్షేత్రం నరక మార్గం పూర్తి అభయారణ్యం ఎటువంటి అన్నపానీయాలు దొరికే ఆస్కారం లేని కీకారణ్యం. దాదాపు రెండు లక్షల మందికి పైగా కాలినడకన శివ భక్తులు శ్రీశైల మల్లీశ్వరుడిని దర్శించుకోవడానికి వెళ్తుంటారు.వారికి రుచికరమైన అన్న ప్రసాదం కల్పించడానికి ఎస్ఆర్ఎం బిల్డర్స్ అధినేత శివారెడ్డి ఆధ్వర్యంలో మిత్రబృందం నడుం బిగించింది.

**రూ.1.50 కోట్లతో శ్రీశైల భక్తులకు అన్నప్రసాదాలు**

నగరానికి చెందిన యువత దైవకార్యానికి ఏకమయ్యారు. ప్రతి ఏటా లక్షల రూపాయలు వెచ్చించి, ఈ అన్న ప్రసాద మహత్కార్యానికి తమ వంతు సహాయం అందిస్తూ వస్తున్నారు. ఎస్ ఆర్ ఎమ్ బిల్డర్స్ అధినేతలు శివారెడ్డి, హరి ప్రసాద్ చౌదరి ఆధ్వర్యంలో వారి మిత్రబృందం ఏకంగా రూ.1.50 కోట్ల సమకూర్చి శ్రీశైల భక్తులకు అన్నపానీయాలు సమకూర్చనున్నారు. సోమవారం నుండి దాదాపు వారం రోజులపాటు కాలినడక భక్తులకు రుచికరమైన అన్నప్రసాదాలు కల్పించనున్నారు.

**భక్తుల అత్యవసర చికిత్స కోసం 5 అంబులెన్స్ లు**

ఈ సందర్భంగా ప్రసాద వితరణ దాత శివారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 8 నుండి 14 వరకు పెద్ద చెరువు, వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం వద్ద కాలినడక శివ భక్తులకు అన్న ప్రసాదం కల్పించినట్లు ఆయన తెలిపారు.ఈ నల్లమల అటవీ ప్రాంతంలో దాదాపు పది చోట్ల తాగునీటి అవసరాల ఏర్పాటు చేసినట్లు శివారెడ్డి వివరించారు.అలాగే భక్తులు ఎటువంటి అనారోగ్యానికి గురైనా వారికి అత్యవసర చికిత్స అందించడానికి ఏకంగా 5 అంబులెన్స్ లను ఏర్పాటు చేశారు. అస్వస్థతకు గురయ్యే భక్తులకు ఉచితంగా మందులు కూడా ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు.నగరంలోని ఎస్ఆర్ఎం బిల్డర్స్ కార్యాలయం వద్ద నిత్యవసర సరుకులు తరలించే వాహనాలను లాంఛనంగా పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, మనోజ్ కుమార్ రెడ్డి, దీపక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఈటీవీ ఈనాడు వార్షికోత్సవ వేడుకలు

**అనంతపురం ప్రతినిధి, ఫిబ్రవరి 08, (రిపబ్లిక్ న్యూస్):**

తెలుగు పాఠకులకు ఉదయాన్నే సమాచారం అందించే ఈనాడు దినపత్రిక నిత్యం ప్రతి ఇంట్లో కుటుంబ కథా సీరియల్స్, ఆటలు, వినోదాలతో పాటు ప్రపంచంలో జరిగే ప్రతి విషయం అందరికి అందించి అలరించే ఈటీవీ ఛానల్ వార్షికోత్సవ వేడుకలు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు సారథ్యంలో అనంతపురం పట్టణం జేఎన్‌టీయూ యూనివర్సిటీ గ్రౌండ్ నందు ఘనంగా జరిగాయి. ఈటీవీ ఛానల్ 30వ వార్షికోత్సవం, ఈనాడు దినపత్రిక 50 వసంతాల వేడుకలకు ముఖ్యఅతిథులుగా కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సిందూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొనగా వీరిని ఈనాడు, ఈటీవీ బృంద సభ్యులు సాధరంగా ఆహ్వానించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సినిగీతాలతో, కామెడీలతో అనంత ప్రజలను సంగీత విభావరిలో ఓలలాడించారు. అనంతరం ఈటీవీ, ఈనాడులో ఉత్తమ సేవలు అందించిన వారికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు చేతుల మీదుగా అవార్డ్స్ అందజేశారు.










## ఘనంగా జన్మదిన వేడుకలు

**ధర్మవరం ఫిబ్రవరి 08( రిపబ్లిక్ న్యూస్)**



సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణం లో నందకుమార్ శాంతమ్మ కుమార్తె జెస్సికా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అమ్మమ్మ కమలమ్మ తాతయ్య ప్రసాద్ పెద్దప్ప బాబాయ్ పిన్నిలు ఈశ్వర్ అరుణ శ్యామల నరసింహులు మామయ్య సురేష్ సృజన ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నామని తెలియజేశారు

### కోవెలకుంట్ల సర్కిల్ పరిధిలోని కంపమల్ల గ్రామం నందు

# కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహణ

**ప్రజల భద్రత, రక్షణను ప్రధాన లక్ష్యంగా తీసుకొని, నేరాలు అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా కార్డన్, సెర్చ్ నిర్వహణ**

**అనుమానాస్పద ప్రదేశాల తనిఖీలు, వాహనాల పరిశీలన, నేరస్థుల కదలికలపై పర్యవేక్షణ, అక్రమ రవాణా నిరోధక చర్యలు**





**నంద్యాల క్రైం, ఫిబ్రవరి 8, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా వ్యాప్తంగా నేరాలను ముందస్తుగా అరికట్టి, ప్రజల్లో భద్రతా వాతావరణాన్ని బలపరచాలని,ప్రతి ప్రాంతంలో పోలీసుల సాన్నిధ్యం స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున కోయిలకుంట్ల సర్కిల్ పరిధిలోని కోయిలకుంట్ల, సంజమల, రేవనూరు పోలీస్ అధికారులు, సర్కిల్ సిబ్బందితో కలిసి సమస్యాత్మకమైన కంపమల్ల గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు అనుమానాస్పద ప్రదేశాలు తనిఖీలు నిర్వహించడంతోపాటు రౌడీ షీటర్లు, నేర చరిత్ర గల వారి ఇలలో సోదాలు నిర్వహించడం జరిగింది. అంతేకాక గ్రామస్తులతో సమావేశం నిర్వహించి సైబర్ భద్రత, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించడం జరిగింది. చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీస్ అధికారులు హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు లేదా వాహనాలను గమనిస్తే, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయని భరోసా ఇచ్చారు. అదేవిధంగా, ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పోలీసుల సహాయాన్ని పొందవచ్చని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు విభాగం సమన్వయంతో, స్థానిక ప్రజల సహకారంతో ఈ కార్డన్, సెర్చ్ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా నిరంతరంగా కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.

## నా వార్డు ప్రజలే నాకు శ్రీరామరక్ష

**-15వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి చిట్టిబాబు.**



**అందోల్ ఫిబ్రవరి 8 ( రిపబ్లిక్ న్యూస్)**



అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో 15వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి ఆకుల సత్యనారాయణ చిట్టిబాబు గడపగడపకు తిరిగి అక్కచెల్లెమ్మలతో జోరుగా ప్రసారం సాగిస్తున్నారు. ప్రతి గడపకు వెళ్ళిన ప్రజల ఆశీర్వాదం పొందుతున్నాడు, అంతేకాకుండా చిట్టి బాబుకు వీర తిలకం దిద్ది మా మద్దతు మీకే ఉంటుందని మహిళ సోదరిమణులు వారి ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. అది విన్న చిట్టిబాబు మీ సేవ చేయడానికి నా జీవితం మొత్తం అర్పిస్తానని ఆయన సంతోషం వ్యక్తం పరిచారు.

### ఇళ్ల నిర్మాణాలు ఆపిన

# పాపం పరిటాల సునీతదే

**రాక్షస మనస్తత్వంతోనే ఆమె విజిలెన్స్‌కు లేఖ రాసింది -నిర్మాణాలను అడ్డుకున్న ప్రతి ఒక్కరికి శిక్ష పడేలా చేస్తాం**

**రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణాల స్కీం మనుగడ ప్రశ్నార్థకమే - నన్ను ఆర్థికంగా దెబ్బ తీయడం ఇది కొత్తకాదు -రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి**





**అనంతపురం హౌసింగ్, ఫిబ్రవరి 08, (రిపబ్లిక్ న్యూస్):** దుర్మార్గమైన, కిరాతకమైన, రాక్షస మనస్తత్వం కల్గిన పరిటాల సునీత విజిలెన్స్‌కు రాసిన లేఖ కారణంగానే రాష్ట్రంలో నిరుపేదల ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయి. ఈ పాపం పరిటాల సునీతదే'నని రాప్తాడు మాజి ఎమ్మెల్యే,నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం అనంతపురంలోని వైఎస్సార్‌సిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పేదల గొంతు నిలిపేశాయి**

ఇళ్ల నిర్మాణాల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి 20 లక్షల ఇళ్లను కేంద్రం నుంచి తీసుకొచ్చారని, రాష్ట్ర వాటా 30 వేలు చొప్పున రూ. 6 వేల కోట్లు కేంద్రానికి చెల్లించాలి. అయితే ఈ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు కాబట్టి వీటి కారణంగా కేంద్ర ప్రభుత్వం 3 లక్షల ఇళ్లను రద్దు చేసిందని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి పేదల గొంతు నులిమేశాయని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ఇళ్ల నిర్మాణాల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయింది. ఇళ్ల నిర్మాణాలను రాక్రీట్ సంస్థ పట్టించుకోలేదని ఎల్లోమీడియా మళ్లీ దుష్ప్రచారం చేస్తోంది. రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో లోటుపాట్లు ఉన్నాయని విజిలెన్స్ విచారణ జరపాలంటూ పరిటాల సునీత లేఖ రాసింది. ఫలితంగా విజిలెన్స్ విచారణ చేసింది. దీంతో పనులు ఆపేశారు. రాక్రీట్ సంస్థకు ఇచ్చిన ఇసుక, సిమెంటు, ఐరన్ అంతా హౌసింగ్ అధికారులు వెనక్కు తీసుకున్నారు. కేవలం నన్ను అప్రతిష్టపాలు చేయాలని, మా బంధువుకు చెందిన రాక్రీట్ సంస్థపై ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై పచ్చపత్రికలు రాస్తున్నవన్నీ బూతు కథనాలే.

కాని నిరుపేదలైన 50 వేల మంది లబ్ధిదారుల ఇళ్లు నిర్మించకుండా అడ్డుకుంటారా అని తీవ్రంగా విమర్శించారు.

**రూ.30 కోట్ల విలువైన మిషనరీ తదితర వృథా**

జగనన్నకాలనీల్లో చాలావరకు సిమెంటు, ఇసుక, పెల్లలు, సెంట్రింగ్ సామాన్లు, కడ్డీలు, మిషనరీల మోటార్లు ఎత్తుకెళ్లారు. రూ.20 కోట్ల దాకా నష్టం కల్గించారన్నారు. అధికారుల దృష్టిలోపం ఉంది. మరో రూ.30 కోట్ల విలువైన మిషనరీ తదితర వృథాగా ఉన్నాయి. రూ.38 కోట్లు సంస్థకు బిల్లులు రావాల్సి ఉంది. రాక్రీట్ సంస్థ సంపూర్ణంగా నష్టపోయిందన్నారు. పరిటాల సునీతది ఎంత పాశవికమైన మనస్తత్వం అంటే ఆమె పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ ప్రతిపక్షాన్ని ఆర్థికంగా దెబ్బతీయాలని ఆలోచిస్తుందన్నారు. చంద్రబాబూ ఇప్పటికైనా దుష్టలను దూరం పెట్టండని, రాష్ట్ర వాటా చెల్లించి కేంద్రం నుంచి నిధులు తెప్పించి ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలన్నారు.

**మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఇళ్లన్నీ పూర్తి చేస్తాం**

నన్ను ఆర్థికంగా దెబ్బ తీయడం ఇది కొత్తకాదు. 2014లో మీరు అధికారంలోకి వచ్చినప్పుడు కూడా నేను కాంట్రాక్టర్‌గా చేస్తున్న పనులను రద్దు చేసి నామినేషన్ పద్ధతిలో మీ వాళ్లకు కట్టబెట్టి నన్ను ఇబ్బంది పెట్టారు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత అవన్నీ మరిచిపోయి పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా సంక్షేమ పథకాలు అమలు చేశాం. ఇసారి అలా ఉండదు. పేదలకు చెందిన 50 వేల ఇళ్ల నిర్మాణాలు జరగకుండా అడ్డుకున్న ప్రతి ఒక్కరినీ వెతుకుతాం. వెంటపడతాం. వేటాడతాం. శిక్ష పడేలా చేస్తాం. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఇళ్లన్నీ పూర్తి చేస్తాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు వస్తున్న జనాధారణ చూస్తుంటే చంద్రబాబు ప్రభుత్వం సంపూర్ణంగా విఫలమైందనేది స్పష్టమవుతోంది. బలప్రదర్శన అవసరమా? అని చంద్రబాబు మాట్లాడతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నుంచి గుంటూరు వెళ్లేందుకు 6 గంటల సమయం పట్టింది. ఇది లాఅండ్‌ఆర్డర్ ఉల్లంఘన అని ఎక్కడికి వెళ్లినా లాఅండ్‌ఆర్డర్ కఠినంగా అమలు చేస్తామంటున్నారు.ఎలాంటి సమీకరణ చేయకుండానే ఈస్థాయిలో ప్రజలు వస్తున్నారంటే ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు అద్దం పడుతోంది. చంద్రబాబు మోసాలు నమ్మి జగన్‌మోహన్‌రెడ్డి అన్యాయం చేశామని పశ్చాతాప్యం పడుతున్నారన్నారు.

## వీఆర్ఏ పై హత్యాయత్నం కేసులో ఇద్దరు వ్యక్తులు అరెస్టు.

**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 8 రిపబ్లిక్ న్యూస్.**



రైల్వే కోడూరు మండలం చిట్వేలికి వెళ్లే దారి బ్రిడ్జి వద్ద ఫిబ్రవరి 4వ తేదీన మండల తాసిల్దారు కార్యాలయంలో వీఆర్ఏ గా పనిచేస్తున్న కనుపర్తి మణి పై కత్తులతో దాడి చేసి పరారైన ఇద్దరూ వ్యక్తులను ఆదివారం రైల్వే కోడూరు అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సి చంద్రశేఖర్ ఆదివారం అరెస్టు చేశారు, నిందితులు ఇద్దరినీ రైల్వే కోడూరు మండల చివర ప్రాంతం అనంతరాజుపేట దగ్గర అరెస్టు చేసినట్లు తెలియజేశారు, హత్యాయత్నానికి ఉపయోగించిన మారణాయుధాలను, బైకును స్వాధీనం చేసుకుని వారు ఇద్దరినీ కోర్టులో హాజరు పరిచినట్లు విలేకరుల సమావేశంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ తెలియజేశారు,

# దళితులపై జరుగుతున్న హత్య లు దాడులపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి

**దీనిపై పోలీస్ డిపార్ట్మెంట్ హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్**






**కర్నూలు ప్రతినిధి, ఫిబ్రవరి 8, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)** కర్నూలు జిల్లాకు వచ్చిన శనివారం ఎస్సీ కమిషనర్ చైర్మన్ కర్నూల్ కు వచ్చిన సందర్భంగా దళిత మాదిగలపై దాడులకు బలైపోయిన కుటుంబాలను పర్యటించి వారి యొక్క ఎస్సీలకు రావలసిన రిజర్వేషన్ల గురించి వారి చట్టాలపై వారికి ఉన్న అవగాహన గురించి ప్రజలకు తెలియజేస్తున్న దళిత మాదిగ కులానికి చెందిన తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామ వాసి రమేష్ పై కొంతమంది దుండగులు ఆయనను వాకింగ్ కు వెళ్తున్న సందర్భంగా, టాక్టర్ , తో గుద్ది రాడ్లతో కొట్టి అత్త మార్చడం జరిగింది, పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామం టీఎం రమేష్ ను అతి దారుణంగా హత్య చేయడం వలన దళిత మాదిగలకు ప్రభుత్వం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పీఎం రమేష్ కి న్యాయం చేయగలరని ఎమ్మార్పీఎస్ ఫౌండర్ నాయకలు సోమ సుందరం డిమాండ్ చేశారు,బెనిఫిట్స్ తెలియజేయడానికి ఎస్సీ కమిషనర్ విజయవాడ నుండి కర్నూలు జిల్లా కు చేయడమైనది తదుపరి ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నాయకులు మాదిగ పసాని, సుధాకర్, మాదిగ జిల్లా అధ్యక్షులు బండారు శైలజ, ఎమ్మార్పీఎస్ మహిళా అధ్యక్షురాలు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులు రెడ్డి పోగు కళావతి, రాజు ఎమ్మార్పీఎస్ అంజి, శ్రీరాములు ,ఎమ్మార్పీఎస్ రమేష్ మొదలగు వారు ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్ జవహర్ కి పూలమాలలతో శాలువలతో ఆయనను సన్మానించడం జరిగింది,మరియు ఎస్సీ కమిషన్ చైర్మన్ కి ఎస్సీలపై జరుగుతున్న దాడులు మహిళపై జరుగుతున్న దాడులపై అనుమానాల గురించి అలాగే ఎస్సీ ఎస్టీ నెంబర్ ఎంఆర్పిఎస్ ఫౌండర్ ఎస్సీ ఎస్టీ నెంబర్స్ మేకల దాసు అలాగే నాయకులు మాధవి చర్చించి విషయాలను తెలియజేసి జేఏసీ తరపున పోలీసు వారికి ఎస్పీ కేసులు నిర్వహించడం చేస్తూ మాదిగలకు డిఎస్పి సాయి వారు ఎస్పి, కలెక్టర్, ఎమ్మార్వోలు, ఆర్యలు మాదిగల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు కేసులు నీరు కారుస్తున్నారు అని వారిపై చర్యలు తీసుకోమని దళిత మాదిగలకు న్యాయం చేయగలరని తెలియజేశారు, కర్నూల్ నగరంలో అశోక్ నగర్ 45వ వార్డులో గల డేవిడ్ కాంపౌండ్ నందు గల ఇంటి నెంబర్ సోమసంద్రం తండ్రి నయనాథన్ అనే సోమ సుందరం మీద పదిమంది వాహనంలో వచ్చి మాదిగలపై దాడి చేసి రివల్ వారితో చంపుతామని బెదిరించి భయభ్రాంతులకు గురిచేసి మా స్థలంలో వేసిన టీ పాయింటు హోటలను అతను అనుచరులు గుండాలతో తీసిపారేసి అని బెదిరిస్తున్నారు, పైపులను రేకులను కోసి వెళ్ళినారు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ నందు ఎఫ్ఆర్ అయింది కానీ డిఎస్పీ మా అందరిని విచారించి వీడియో తీసినారు కానీ 9 5 2025న ఇచ్చిన కంప్లేటు ఇంతవరకు చార్ సీటు వేయలేదు కోర్టు నందు కూడా జడ్జి అట్రాసిటీ బెల్ను రద్దు పరిచినారు, కావున మమ్ములను దాడి చేసిన అగ్రకులాల వారు ఇంకా మాపై దాడి చేయడానికి కేసు విద్యుడా చేసుకోకపోతే మమ్మును చంపుతామని సేపూరి విజయమోహన్ ఎన్ వి ఎస్ ప్రసాద్ ప్రసాద్ దుబాయ్ భాష పరశురాం మొదలు వారు దాడి చేయడానికి మా హోటల్ పై పెట్రోల్ పోసి అంటే ఇస్తామని వచ్చి బెదిరిస్తున్నారు, కనుక మాకు రక్షణ కల్పించి మాపై దాడులకు పాలు పడుతున్న వారిపై వెంటనే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాను చారి సీటు వేసి మాకు న్యాయం చేయగలరని కోరుచున్నాము ఇట్లు సోమసందరం నాయ కళ్ళు ఎస్సీ ఎస్టీ కమిషన్ జవహర్ కి తెలియజేయడం జరిగింది నాకు నా కుటుంబానికి ప్రాణహానే ఉంది వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులు పోలీసులు నాకు ప్రాణ రక్షణ కల్పించాలని పోలీసు వారికి విజ్ఞప్తి చేసుకుంటున్నాను చేస్తున్నాను ఎందుకు అంటే ఉదాహరణ బొందిమడుగులలో జరిగిన సంఘటన గురించి జిల్లా వ్యాప్తంగా తెలిసినదే కాబట్టి నా పైన కూడా అలా చేయగలరని నాకు ప్రాణ భయం ఉంది దయచేసి నాకు పోలీసు వారు రక్షణ కల్పించవలసినదిగా వారిని కోరుకుంటున్నాను

ప్రజా రిపబ్లిక్



# విద్యార్థి సంఘ నేతల కిడ్నాప్ కేసు..

## అందుబాటులో లేని మోహన్‌బాబు -మంచు విష్ణుకు నోటీసులు



**తిరుచానూరు, ఫిబ్రవరి 8**

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, ఉపాధ్యక్షుడు వినోద్‌లపై మోహన్‌బాబు యూనివర్సిటీ ప్రతినిధులు, బౌన్సర్లు దాడి చేసిన కేసులో విచారణకు హాజరు కావాలంటూ తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ బృందం మంచు విష్ణుకు నోటీసులు అందజేసింది. అయితే ఈ నెల 15 వరకు ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నాయని, ఆతర్వాత విచారణకు వస్తానని విష్ణు చెప్పినట్టు సీఐ తెలిపారు. మరోమారు నోటీసులు ఇచ్చి, విచారణకు హాజరు కావాలని విష్ణును కోరతామన్నారు. కాగా, హైదరాబాద్‌లోని మోహన్‌బాబు నివాసానికి పోలీసులు నోటీసులు తీసుకెళ్లగా.. ఆయన అందుబాటులో లేకపోవడంతో చంద్రగిరి మండలం రంగంపేటలోని ఎంబీయూకు వెళ్లారు. అక్కడ కూడా లేకపోవడంతో పోలీసులు వెనుదిరిగారు. మోహన్‌బాబు ఎక్కడ ఉన్నా నోటీసులు అందజేస్తామని సీఐ చెప్పారు. కాగా, ఈ కేసుకు సంబంధించి తిరుచానూరు పోలీస్ స్టేషన్ లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఎంబీయూ పీఆర్వో సతీష్, ప్రతినిధులు, బౌన్సర్లను ఇప్పటికే అరెస్టు చేశారు. ఈ కేసులో ఏ2గా మంచు మోహన్‌బాబు, ఏ3గా విష్ణు ఉన్నారు. కేసును కొట్టివేయాలంటూ హైకోర్టులో మోహన్‌బాబు క్వాష్ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే.

# వంద కోట్ల భూమిని కాపాడిన హైడ్రా..



**హైదరాబాద్**

హైదరాబాద్ లోని ప్రభుత్వ స్థలాల ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా అధికారులు తాజాగా వంద కోట్ల విలువైన నాలుగు ఎకరాల స్థలాన్ని కాపాడారు. ఆక్రమణలు కూల్చివేసి కబ్జాదారుల చెర నుంచి విలువైన భూమిని విడిపించారు. అమీన్ పూర్ లోని చక్రపురి లేఔట్ లో రోడ్లు, పార్కు స్థలం కబ్జాకు గురైందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. ఈరోజు ఉదయం బుల్డోజర్లతో అమీన్ పూర్ చేరుకున్న అధికారులు.. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టిన నిర్మాణాలను కూల్చివేశారు.పోలీస్ సిబ్బంది బందోబస్తుతో రెవెన్యూ అధికారుల సమక్షంలో హైడ్రా అధికారులు మొత్తం 15 జేసీబీలతో ఆక్రమణలు తొలగించారు. దీంతో పాటు మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా దూలపల్లి విలేజ్‌లోని సుమారుకుంటలో, నాగారం రామకృష్ణ నగర్ కాలనీలోని శివాలయానికి చెందిన 1,365 గజాల స్థలాన్ని, యూసుఫ్గూడలో మూడున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా హైడ్రా కాపాడింది.

# ఎప్ స్టీన్ ఫైల్స్ పై దలైలామా వివరణ



ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్ స్టీన్ ఫైల్స్ లో బౌద్ధ మతగురువు దలైలామా పేరు పలుమార్లు ప్రస్తావనకు రావడం తెలిసిందే. అమెరికా న్యాయ శాఖ ఇటీవల విడుదల చేసిన ఫైల్స్ లో ఏకంగా 169 చోట్ల దలైలామా పేరు కనిపించింది. ఈ విషయంపై నెలకొన్న అనుమానాలకు దలైలామా తాజాగా వివరణ ఇచ్చారు. ఎక్స్ వేదికగా మీడియా ప్రకటన విడుదల చేశారు. మహిళలు, మైనర్లపై లైంగిక నేరాలకు పాల్పడ్డ నిందితుడు జెఫ్రీ ఎప్ స్టీన్ ను తాను ఎన్నడూ కలవలేదని స్పష్టం చేశారు.
ఎప్ స్టీన్ ఫైల్స్ లో తన పేరు ప్రస్తావన, తనపై వస్తున్న ఆరోపణలు అన్నీ నిరాధారమైనవని కొట్టిపారేశారు. ఎప్ స్టీన్ తో కానీ ఆయన ప్రతినిధులతో కానీ తాను ఎన్నడూ ఎలాంటి సమావేశాలు నిర్వహించలేదని స్పష్టం చేశారు. ఇటీవల కొన్ని పత్రికల్లో వచ్చిన కథనాలు, సోషల్ మీడియా పోస్టుల్లో జెఫ్రీ ఎఫ్ స్టీన్ తో దలైలామా సమావేశమైనట్లు చూపించడంపై దలైలామా ఆఫీసు అభ్యంతరం వ్యక్తం చేసింది. దలైలామాపై అసత్య ప్రచారం జరుగుతోందని ఆరోపించింది.

# చెన్నైలో పెళ్లి వేడుకకు హాజరైన స్టాలిన్, జగన్, విజయ్





**చెన్నై** :రాజకీయ, సినీ రంగాలకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఒకే వేడుకలో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్, నటుడు-రాజకీయ నేత 'దళపతి' విజయ్ ఆదివారం చెన్నైలో జరిగిన ఒక వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఇటీవలే రాజకీయాల్లోకి ప్రవేశించిన విజయ్.. ఇద్దరు అగ్రనేతలతో కలిసి కనిపించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.వైసీపీ అధినేత జగన్ బంధువు వై.ఎస్. సునీల్ రెడ్డి కుమారుడు సాహిల్ రెడ్డి వివాహం చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హాజరైన స్టాలిన్, జగన్, విజయ్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. జగన్, విజయ్ పక్కపక్కనే కూర్చుని కాసేపు ముచ్చటించుకోవడం కెమెరాల కంటపడింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇటీవలే 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పేరుతో విజయ్ రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. మరోవైపు, 'జన నాయగన్' అనే తన సినిమా సెన్సార్ వివాదాలతో వార్తల్లో నిలిచారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో జగన్, స్టాలిన్ వంటి ప్రముఖ నేతలతో విజయ్ కనిపించడం తమిళ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఈ వివాహ వేడుకకు నటులు సూర్య, కార్తి కూడా హాజరయ్యారు.

# ప్రేమ వివాహం విషాదాంతం..

## తిరుపతి జిల్లాలో కంటతడి పెట్టిస్తున్న ఘటన

**పుత్తూరులో ఇద్దరు పిల్లలకు ఉరివేసి తల్లి ఆత్మహత్య**

**భర్త నిరుద్యోగం, ఆర్థిక సమస్యలే కారణమని వెల్లడి**

**ఆత్మహత్యకు ముందు ఆవేదనతో సూసైడ్ నోట్ రాసిన మహిళ**

**తల్లిదండ్రులను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకోవడమే తప్పయిందని ఆవేదన**



**తిరుపతి:**

తిరుపతి జిల్లా పుత్తూరులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ తల్లి తన ఇద్దరు కన్నబిడ్డలకు ఉరివేసి, ఆపై తానూ ఆత్మహత్య చేసుకుంది. పుత్తూరులోని కృష్ణానగర్‌లో శనివారం జరిగిన ఈ హృదయ విదారక ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆత్మహత్యకు ముందు ఆ తల్లి రాసిన సూసైడ్ నోట్, ఆమె పడిన మానసిక వేదనను కళ్లకు కడుతోంది.
పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... పద్మ (28) అనే మహిళ తన కుమార్తెలు తేజ శ్రీ (6), లాస్య (5)లను చంపి, అనంతరం తానూ బలవన్మరణానికి పాల్పడింది. నిన్న సాయంత్రం భర్త శివశంకర్ ఇంటికి వచ్చి చూడగా ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. పద్మ, శివశంకర్ డిగ్రీ చదివే రోజుల నుంచి ప్రేమించుకుని, 2019లో పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నారు. అయితే, పెళ్లైన తర్వాత కూడా శివశంకర్ ఏ పనీ చేయకుండా బాధ్యతారహితంగా ఉండటంతో కుటుంబంలో ఆర్థిక కష్టాలు మొదలయ్యాయి.
పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి ఖర్చులు, డ్వాక్రా సంఘంలో తీసుకున్న అప్పు చెల్లించలేక పద్మ తీవ్రంగా మదనపడినట్లు తెలుస్తోంది. ఈ విషయమై శనివారం భర్తకు ఫోన్ చేయగా, డబ్బులు సర్దుబాటు కాలేదని చెప్పడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురైంది. ఇదే క్రమంలో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

**కన్నీరు పెట్టిస్తున్న సూసైడ్ నోట్**

ఘటనా స్థలంలో లభించిన సూసైడ్ నోట్‌లో పద్మ తన ఆవేదనను తెలియజేసింది. "తల్లిదండ్రులను కాదని పెళ్లి చేసుకున్న ప్రతి అమ్మాయికి నా జీవితం ఓ గుణపాఠం. ఒక అమ్మాయి ఏ లక్షణాలైతే తన భర్తకు ఉండకూడదని అనుకుంటుందో... అలాంటి లక్షణాలన్నీ నా భర్తలో ఉన్నాయి. నిన్ను ప్రేమించి పెళ్లి చేసుకున్న పాపానికి ఎన్నో కష్టాలు పడ్డాను. నా కడుపున పుట్టినందుకు ఈ పిల్లలూ ఆ కష్టాన్ని అనుభవిస్తున్నారు" అని లేఖలో పేర్కొంది. "నేను చనిపోతే ఇంకో పెళ్లి చేసుకుంటావ్. కనీసం ఈ సారైనా లైఫ్‌లో సెటిల్ అయ్యాక పెళ్లి చేసుకో" అని భర్తను ఉద్దేశించి రాయడం అందరినీ కలిచివేసింది.
స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పద్మ రాసిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకుని, భర్త శివశంకర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఓటుకు నోటు, ఫోన్ ట్యాపింగ్

# కేసుల ఆధారాలు సేఫ్



నాంపల్లిలోని స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ లో జరిగిన అగ్నిప్రమాదాన్ని ఆసరాగా చేసుకుని సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో సాగుతున్న ప్రచారానికి ఎఫ్ఎస్ఎల్ డీజీ శిఖా గోయల్ తెరదించారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఓటుకు నోటు, ఫోన్ ట్యాపింగ్ వంటి కీలక కేసుల ఆధారాలు కాలి బూడిదయ్యాయన్న వార్తలను ఆమె తీవ్రంగా ఖండించారు. ఆదివారం ప్రమాద స్థలిని పరిశీలించిన ఆమె, రికార్డుల భద్రతపై మీడియాకు పూర్తిస్థాయి వివరణ ఇచ్చారు.
ఓటుకు నోటు: ఎప్పుడో కోర్టుకు అప్పగించాం 2015లో నమోదైన ఓటుకు నోటు కేసుకు సంబంధించిన ఫైళ్లు ప్రస్తుతం ల్యాబ్‌లోనే లేవని శిఖా గోయల్ స్పష్టం చేశారు. "ఈ కేసులో 2015లో రెండు విడతలుగా మాకు 16 మెటీరియల్ ఆబ్జెక్టులు అందాయి. వాటిపై ఫోరెన్సిక్ పరీక్షలు పూర్తి చేసి, అదే ఏడాది నివేదికలతో సహా అన్ని ఆధారాలను ఏసీబీ కోర్టుకు తిరిగి ఇచ్చేశాం. ప్రస్తుతం ఆ వస్తువులన్నీ కోర్టు భద్రతలోనే ఉన్నాయి. ఇక్కడ లేని వస్తువులు కాలిపోయే ప్రసక్తే లేదు" అని ఆమె తేల్చి చెప్పారు. ఫోన్ ట్యాపింగ్: డేటా రికవరీ సాధ్యమే!
ఇక ఇటీవల సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై వస్తున్న ఆరోపణలను కూడా ఆమె కొట్టిపారేశారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం 136 మెటీరియల్స్ ల్యాబ్‌కు వచ్చాయని, అందులో 129 అత్యంత భద్రంగా ఉన్నాయని తెలిపారు. కేవలం 7 మెటీరియల్స్ మాత్రమే మంటల వల్ల స్వల్పంగా దెబ్బతిన్నాయని, అయితే వాటిలోని డేటాను తిరిగి వెలికితీసే సాంకేతికత అందుబాటులో ఉందని.. ఆధారాలు పూర్తిగా పోలేదని ఆమె భరోసా ఇచ్చారు. ఇప్పటికే మెజారిటీ నివేదికలను దర్యాప్తు అధికారులకు అందజేసినట్లు వెల్లడించారు.ూశ్రీంశీ =ఝుం - అజారుద్దీన్ మంత్రి పదవి మూడు నెలలే ! పక్కా ప్లాన్ ప్రకారమే దర్యాప్తు శనివారం ఉదయం 10:08 గంటలకు ప్రాపర్టీ రూమ్‌లో పొగ రావడాన్ని సిబ్బంది గుర్తించారని, కొద్దిసేపటికే మంటలు లైబ్రరీ, హెచ్ఆర్‌డీ గదులకు వ్యాపించాయని డీజీ వివరించారు. ఈ ప్రమాదం వెనుక ఏదైనా కుట్ర ఉందా లేక సాంకేతిక లోపమా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ప్రమాద సమయంలో ల్యాబ్‌లో ఎవరున్నారు? మంటలు ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలేంటి? అనే అంశాలపై స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తున్నారు. ఆస్తినష్టంపై అంచనా వేస్తున్నామని, త్వరలోనే పూర్తి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు
వదంతులకు చెక్ ముఖ్యమైన ఆధారాలను ధ్వంసం చేసేందుకే ఈ అగ్నిప్రమాదం జరిగిందంటూ వస్తున్న రాజకీయ విమర్శలకు డీజీ వివరణతో బ్రేక్ పడింది. కీలకమైన సాక్ష్యాధారాలన్నీ డిజిటల్ రూపంలోనూ, మరికొన్ని భద్రమైన స్టోరేజ్ ఏరియాల్లోనూ ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె పేర్కొన్నారు.




# ఓఆర్ఆర్‌పై ఏప్రిల్ 1 నుంచి నగదు చెల్లింపులు బంద్..

## పెరగనున్న టోల్ చార్జీలు!

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రయాణికులకు ముఖ్య గమనిక. ఏప్రిల్ 1 నుంచి ఓఆర్ఆర్‌పై ఉన్న అన్ని టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులను పూర్తిగా నిలిపివేయనున్నారు. ఇకపై ఫాస్టాగ్ లేదా యూపీఐ క్యూఆర్ కోడ్ ద్వారా మాత్రమే టోల్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. జాతీయ రహదారులపై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న క్యాష్‌లెస్ విధానాన్ని అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నారు.ప్రస్తుతం ఫాస్టాగ్ ఉన్న వాహనాలు ఆటోమేటిక్‌గా స్కాన్ అవుతుండగా, ఫాస్టాగ్ లేనివారు నగదు చెల్లించే అవకాశం ఉంది. ఏప్రిల్ 1 నుంచి ఈ నగదు విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నారు. అలాంటి వారు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చెల్లింపులు చేయవచ్చు. ఓఆర్ఆర్‌పై పెద్ద అంబర్‌పేట్, మేడ్చల్, కోకాపేట, శంషాబాద్‌తో సహా మొత్తం 19 ఇంటర్‌ఛేంజ్ టోల్ ప్లాజాలను హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) నిర్వహిస్తోంది.నగదు నిర్వహణ, రవాణా, భద్రపరచడం వంటి సమస్యలతో పాటు చిల్లర విషయంలో ప్రయాణికులకు, సిబ్బందికి మధ్య తరచూ వాగ్వాదాలు జరుగుతున్నాయని హెచ్‌జీసీఎల్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. రికార్డుల నిర్వహణలో పారదర్శకత లోపించడం, దొంగతనాల వంటి భద్రతాపరమైన సమస్యలను అధిగమించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

**రెండేళ్ల తర్వాత టోల్ రేట్ల పెంపు**

మరోవైపు ఓఆర్ఆర్‌పై టోల్ చార్జీలను కూడా 2026 ఏప్రిల్ 1 నుంచి పెంచే అవకాశం ఉంది. చివరిసారిగా 2024 ఏప్రిల్‌లో టోల్ రేట్లను సవరించారు. వివిధ కారణాల వల్ల 2025 ఏప్రిల్‌లో పెంపును చేపట్టలేదు. దీంతో రెండేళ్ల విరామం తర్వాత సవరించిన టోల్ రేట్లు అమల్లోకి రానున్నాయని అధికారులు తెలిపారు. దీనిపై తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది.

# జీ5 వేదికగా ఓటీటీలోకి మన శంకరవరప్రసాద్ గారు

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఆ క్షణం రానే వచ్చేసింది. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా విడుదలై బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం ఇప్పుడు డిజిటల్ తెరపై సందడి చేసేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ చిత్ర డిజిటల్ హక్కులను సొంతం చేసుకోగా.. ఈ సినిమాను ఫిబ్రవరి 11నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. దర్శకుడు అనిల్ రావిపూడి మార్కు కామెడీ మరియు ఫ్యామిలీ ఎమోషన్స్‌తో రూపొందిన ఈ చిత్రం, థియేటర్లలో ఏకంగా రూ.375 కోట్లకు పైగా వసూళు సాధించి ఇండస్ట్రీ హిట్లలో ఒకటిగా నిలిచింది. మెగాస్టార్ చిరంజీవి సరసన నయనతార కథానాయికగా నటించగా, విక్టరీ వెంకటేష్ తన స్పెషల్ అప్పీరెన్స్‌తో ప్రేక్షకులను ఫిదా చేశారు. ముఖ్యంగా ఓటీటీలో స్ట్రీమింగ్ అయ్యే వెర్షన్‌లో థియేటర్లో కట్ చేసిన కొన్ని చిరంజీవి, ÷ం గణెళిష్ కాంబినేషన్ కామెడీ సీన్లను కూడా జత చేయబోతుండటం విశేషం.




# 'ఉస్తాద్ భగత్ సింగ్' డబ్బింగ్ మొదలుపెట్టిన రాశీ ఖన్నా

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా, దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా పనులు వేగంగా జరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న రాశీ ఖన్నా తన పాత్రకు డబ్బింగ్ చెప్పడం ప్రారంభించారు. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు.డబ్బింగ్ స్టూడియోలో స్క్రిప్ట్ చేతిలో పట్టుకుని నవ్వుతూ ఉన్న ఫోటోను రాశీ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. "డబ్బింగ్ మొదలైతే, కౌంట్‌డౌన్ నిజంగా మొదలైనట్టే అనిపిస్తుంది. దాదాపు పూర్తి కావొచ్చింది" అని క్యాప్షన్ జోడించారు. మార్చి 26న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో, ఈ అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో రాశీ 'శ్లోక' అనే కీలక పాత్రలో కనిపించనుంది.పవన్ కల్యాణ్‌తో రాశీ ఖన్నా నటిస్తున్న తొలి సినిమా ఇదే. గతంలో పవన్‌తో కలిసి సెల్ఫీ దిగిన ఫోటోను షేర్ చేస్తూ, ఆయనతో నటించడం తనకు దక్కిన గౌరవమని, ఎప్పటికీ గుర్తుండిపోయే జ్ఞాపకమని రాశీ పేర్కొన్నారు.



# ఓటీటీలోనూ దుమ్మురేపుతున్న 'ధురంధర్'



బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న ధురంధర్ ఓటీటీలోనూ సెన్సేషన్ సృష్టిస్తోంది. తాజాగా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ మూవీ గ్లోబల్ టాప్ -10 నాన్ ఇంగ్లిష్ ఫిల్మ్ జాబితాలో నెం.1 స్థానాన్ని దక్కించుకుంది. ఇండియాతో పాటు పాకిస్థాన్‌లోనూ ఈ మూవీకి విశేష ఆదరణ లభిస్తుండటం విశేషం. నెట్‌ఫ్లిక్స్ విడుదల చేసిన తాజా వీక్లీ నివేదిక ప్రకారం 'ధురంధర్' టాప్‌లో నిలిచింది. ఇప్పటివరకు ఈ సినిమాకు 7.6 మిలియన్ వ్యూస్ దక్కినట్లు వెల్లడించింది. 2025 డిసెంబరు 5న థియేటర్లలో విడుదలైన ఈ మూవీ తొలి షో నుంచే మౌత్ టాక్‌తో దూసుకెళ్లింది. సీక్రెట్ ఏజెంట్‌గా హీరో రణ్‌వీర్ సింగ్ లుక్స్, యాక్టింగ్‌తో పాటు విలన్‌గా అక్షయ్ ఖన్నా నటన ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. యాక్షన్ సన్నివేశాలు కూడా సినిమాకు ప్లస్‌గా మారాయి. దీంతో బాక్సాఫీస్ వద్ద వసూళ్ల రికార్డులు సృష్టించిన 'ధురంధర్' దాదాపు రూ.1400 కోట్ల కలెక్షన్లతో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. ఎక్కువ కలెక్షన్లు రాబట్టిన భారతీయ చిత్రాల జాబితాలో నాలుగో స్థానంలో నిలిచిన ఈ సినిమా.. కేవలం ఒక్క భాషలో (హిందీ) విడుదలై అత్యధిక వసూళ్లు సాధించిన రెండో చిత్రంగా రికార్డు సాధించింది.

# నీల్ 'డ్రాగన్'.. తారక్ ఇంకా స్లిమ్

టాలీవుడ్ స్టార్ హీరో, యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్.. ఇప్పుడు డ్రాగన్ మూవీతో ఫుల్ బిజీగా ఉన్న విషయం తెలిసిందే. కన్నడ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న ఆ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. భారీ బడ్జెట్ తో మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ నిర్మిస్తున్న ఆ మూవీపై ఇప్పటికే అటు ఆడియన్స్ లో.. ఇటు సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

అదే సమయంలో ఎన్టీఆర్ లుక్ తో పాటు ఫిట్నెస్ ట్రాన్స్ఫర్మేషన్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. మూవీలో రోల్ కు తగ్గట్టు కంప్లీట్ గా కొత్తగా కనిపించేందుకు ఆయన పెద్ద ఎత్తున వెయిట్ తగ్గుతున్న సంగతి తెలిసిందే. గతంలో పవర్ ఫుల్, బల్కీ ఫిజిక్ తో స్క్రీన్ పై కనిపించిన ఎన్టీఆర్.. ఇప్పుడు స్లిమ్ అండ్ షార్ప్ లుక్ లోకి మారడం అభిమానులను, మూవీ లవర్స్ ను ఇప్పటికే షాక్ కు గురి చేసింది.

రీసెంట్ గా హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ లో ఎన్టీఆర్ కనిపించిన వీడియో కూడా అందరినీ ఆకట్టుకుంటోంది. అందులో తారక్.. స్లిమ్ ఫిట్ బాడీ, గుబురు గడ్డం, ఇయర్ కు రింగ్, బ్లూ జీన్స్ తో పాటు హుడ్డీ ధరించి స్టైలిష్ గా కనిపించడంతో ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ఇదే డ్రాగన్ ఫైనల్ లుక్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ లుక్స్ కు సంబంధించిన పిక్స్ వైరల్ అవ్వగా.. ఇదే ఫైనలేమోనని అంటున్నారు.కానీ సినిమా కోసం ఎన్టీఆర్ ట్రాన్స్ఫర్మేషన్ ఇంకా కొనసాగుతూనే ఉందని ఇప్పుడు టాక్ వినిపిస్తోంది. మరింత సన్నగా, ఫిట్ గా మారేందుకు ఆయన స్పెషల్ డైట్, ప్రత్యేక వర్కౌట్స్ ఫాలో అవుతున్నారని సమాచారం. దీంతో ఆ విషయం తెలిసి.. సినిమాను ఓ రేంజ్ లో నీల్ ప్లాన్ చేస్తున్నట్లు ఉన్నారని ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. తమ అభిమాన హీరో ఇంకా స్లిమ్ అవుతారా అంటున్నారు.



# శ్రీవారి సన్నిధిలో నిధి అగర్వాల్..



ప్రముఖ నటి నిధి అగర్వాల్ ఈ రోజు ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం తిరుమల చేరుకున్న నిధి అగర్వాల్ కు టీటీడీ అధికారులు స్వాగతం పలికి వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించారు. స్వామి వారిని దర్శించుకున్న తర్వాత రంగనాయకుల మండపంలో నిధి అగర్వాల్ కు వేద పండితులు ఆశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలను ఆమెకు అందజేశారు. ఆలయం నుంచి వెలుపలికి వచ్చిన తర్వాత నిధి అగర్వాల్ తో సెల్ఫీల కోసం భక్తులు ఉత్సాహం ప్రదర్శించారు.

# 'వారణాసి'కి విరామం.

టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబు, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కలిసి నటిస్తున్న చిత్రం 'వారణాసి'. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన హైదరాబాద్ షెడ్యూల్‌ను ప్రియాంక పూర్తి చేసుకున్నారు. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా ద్వారా వెల్లడిస్తూ, హైదరాబాద్ నుంచి ఓ ప్రత్యేకమైన జ్ఞాపకాన్ని తనతో పాటు తీసుకెళుతున్నట్లు తెలిపారు.షెడ్యూల్ ముగియడంతో లాస్ ఏంజిల్స్‌కు బయల్దేరిన ప్రియాంక, ఫ్లైట్‌లో ప్రయాణిస్తూ ఇక్కడి ఫేమస్ 'బన్ మస్కా' చిత్రాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పంచుకున్నారు. "హైదరాబాద్ నుంచి ఓ భాగాన్ని నాతో తీసుకెళుతున్నా. త్వరలో కలుద్దాం" అని దానికి క్యాప్షన్ జోడించారు. తాను నటించిన హాలీవుడ్ యాక్షన్ థ్రిల్లర్ 'ది బ్లఫ్' ప్రమోషన్స్ కోసం లాస్ ఏంజిల్స్ వెళుతున్నట్లు మరో పోస్టులో ఆమె స్పష్టం చేశారు. ఆ ప్రచార కార్యక్రమాలు ముగిసిన వెంటనే తిరిగి 'వారణాసి' సెట్స్‌లో జాయిన్ అవుతానని తెలిపారు.చాలా కాలం తర్వాత ప్రియాంక భారతీయ సినిమాలో నటిస్తున్న చిత్రం ఇదే కావడం విశేషం. 'వారణాసి'లో ఆమె 'మందాకిని' అనే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లలో పసుపు చీరలో పిస్టల్ పట్టుకుని ఉన్న ఆమె లుక్ ఆకట్టుకుంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో మహేష్ బాబు 'రుద్ర'గా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ'గా కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# శ్రీవిష్ణు 'మృత్యుంజయ్' చిత్రంలో 'సీతా పరశురామ్'గా రెబా మోనికా జాన్

విలక్షణ నటుడు శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న తాజా థ్రిల్లర్ 'మృత్యుంజయ్'. హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నుంచి మేకర్స్ శనివారం ఓ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న రెబా మోనికా జాన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆమె 'సీతా పరశు రామ్' అనే పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నట్టు వెల్లడించారు.


ఈ పోస్టర్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్న రెబా మోనికా జాన్, "నీడల మధ్య యుద్ధం వివరాల్లో దాగి ఉంది. అప్పుడు దిగుతుంది సీతా పరశురామ్ వేటలోకి!" అని ఆసక్తికరమైన క్యాప్షన్ జోడించారు. ఇప్పటికే ప్రకటించినట్టుగా, ఈ చిత్రాన్ని ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

గతంలో విడుదలైన ఈ సినిమా టైటిల్ టీజర్ ప్రేక్షకులలో అంచనాలను పెంచింది. అందులో శ్రీవిష్ణు ఓ ఖైదీగా కనిపిస్తుండగా, రెబా మోనికా జాన్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించడంతో కథపై క్యూరియాసిటీ నెలకొంది. "ప్రతీ క్లూ ముఖ్యమే. ప్రతీ అడుగు ప్రమాదకరమే. కానీ ఈ ఆటలో, ఎప్పుడు ముగించాలో జై నిర్ణయిస్తాడు" అంటూ గతంలో నిర్మాణ సంస్థ విడుదల చేసిన టీజర్ ట్యాగ్‌లైన్ సినిమా థ్రిల్లర్ నేపథ్యాన్ని స్పష్టం చేసింది.లైట్ బాక్స్ మీడియా పతాకంపై సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని రమ్య గున్నం సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి కాలభైరవ సంగీతం అందిస్తుండగా, శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, విద్యాసాగర్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు.



# వైభవంగా వీరభద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం

## ఆకట్టుకున్న వీరశైవుల ఖడ్గ విన్యాసం





**నంద్యాల ఫిబ్రవరి 8( రిపబ్లిక్ న్యూస్) :** పట్టణం లోని బైరుమల వీధిలో ఉన్న భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆలయ పురోహితులు సాంబయ్య స్వామి ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, అర్చనలు విశేషమైన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు పురవీధుల గుండా గ్రామోత్సవాన్ని కన్నుల పండుగగా చేశారు. గ్రామోత్సవంలో వీర శైవులు ప్రదర్శించిన నందికోలా సేవ, ఖడ్గ ఉచ్చరణ అలరించాయి. ఈ కార్యక్రమంలో వీరశైవ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, డాక్టర్ నటరాజ్, ప్రసూన, ఉప తాసిల్దార్ రవీంద్రప్రసాద్, మల్లికార్జున, నాగరాజు, శ్రీనివాసులు, నాగేంద్రప్ప, వీరభద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 9న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### అర్జీలు ఆన్లైన్లో లో నమోదు చేసుకోవచ్చు

### సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100 -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, ఫిబ్రవరి 08( రిపబ్లిక్ న్యూస్)** ఈ నెల 9న (సోమవారం) నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుండా, ఆన్లైన్‌లో ద్వారా కూడా సమర్పించవచ్చున్నారు. అర్జీ పరిష్కార స్థితి గురించి తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లోనూ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని ఆమె చెప్పారు. అర్జీదారులు మొదట తమ మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయంలోని అధికారులకు అర్జీలు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలు మాత్రమే జిల్లా కేంద్రంలోని వేదికకు రావలసిందిగా కలెక్టర్ సూచించారు. ఇదేవిధంగా జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె ఆదేశించారు.

# వెల్ బేబీ షోలో ... కర్నూలు చిన్నారి జైన్ అష్రఫ్ కి మొదటి బహుమతి







**హైదరాబాద్ ఫిబ్రవరి 8( రిపబ్లిక్ న్యూస్) :** హైదరాబాదులో 85వ అల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ లో జరిగిన వెల్ బేబీ షోలో కర్నూలుకు చెందిన చిన్నారి సయ్యద్ జైన్ అష్రఫ్ మొదటి బహుమతి సాధించి విశేషంగా ఆకట్టుకున్నాడు. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో జాయింట్ కలెక్టర్ గా పని చేసిన ఖాజా మొహిద్దీన్ కుమారుడు డాక్టర్.జావేద్ అష్రాఫ్, డాక్టర్. షాహిరా దంపతుల కుమారుడు సయ్యద్ జైన్ అష్రాఫ్ వెల్ బేబీ షోలో ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాడు. ఆదివారం సాయంత్రం హైదరాబాదు నగరంలోని నాంపల్లి లో 85వ అల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్–2026 లో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా యశోద హాస్పిటల్, ఎగ్జిబిషన్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన వెల్ బేబీ షోలో 15 నెలల సయ్యద్ జైన్ అష్రఫ్ మొదటి బహుమతి గెలుచుకున్నాడు. ఇక్కడే గత ఏడాది జరిగిన 100 రోజుల పిల్లలకు నిర్వహించిన వెల్ బేబీ షో లో కూడా జైన్ అష్రఫ్ మొదటి బహుమతి గెలుచుకోవడం జరిగింది. మొదటి బహుమతి సాధించడం పట్ల అష్రాఫ్ తాత ఖాజా మొహిద్దీన్, తల్లిదండ్రులు డాక్టర్.జావేద్ అష్రాఫ్, డాక్టర్. షహీరా, వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

# మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ట్రాఫిక్ పోలీసులు

### 12 మంది మైనర్లకు కౌన్సిలింగ్ 60,000/- జరిమాన

### రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ప్రజల రక్షణ కోసమని గుర్తించాలి

### నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చాంద్ భాష



**నంద్యాల క్రైం, ఫిబ్రవరి 8, (రిపబ్లిక్ న్యూస్):** రహదారి ప్రమాదాలను నివారించడమే లక్ష్యంతో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చాంద్ బాషా ఆధ్వర్యంలో ఆదివారం ట్రాఫిక్ పోలీసులు పట్టణ కేంద్రంలో మైనర్లు వాహనాలు నడపడం పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించబడింది. ఈ సందర్భంగా 12 మంది మైనర్లు చట్టవిరుద్ధంగా ద్విచక్ర వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి, ఒక్కొక్కరికి 5,000/- రూపాయల చొప్పున 60,000/- జరిమాన విధించడంతో పాటు వారిని తల్లిదండ్రులు, సంరక్షకులను స్టేషన్ వద్దకు పిలిపించి రహదారి భద్రత, మైనర్ల వాహన నడపడం వల్ల కలిగే చట్టపరమైన పరిణామాలు, బాధ్యతగల పర్యవేక్షణ అవసరంపై అవగాహన కల్పించారు. మైనర్లకు ట్రాఫిక్ నియమాలు, సురక్షిత డ్రైవింగ్ పద్ధతులపై ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు నిరంతరం జరుగుతూ ఉంటాయి. కావున ప్రజలు తప్పనిసరిగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలు చేరాలని కోరుకోవడం తోపాటు ఇవన్నీ ప్రజలు రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా రక్షణ కోసమేనని గుర్తించి పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేయడం జరుగుతుంది.

# నంద్యాల జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్

### - 19 సంవత్సరాల లోపు బాల బాలికల చదరంగం పోటీలు


### - ప్రారంభించిన డాక్టర్ రవి కృష్ణ




**నంద్యాల ఫిబ్రవరి 8( రిపబ్లిక్ న్యూస్) :** ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో, నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి పర్యవేక్షణలో ఆదివారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నంద్యాల జిల్లా స్థాయి 19 సంవత్సరాల లోపు బాల బాలికల ఓపెన్ చెస్ టోర్నమెంట్ ప్రారంభమైంది. నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, సత్యసాయి జిల్లా క్రీడా అధికారి కిషోర్ చదరంగం బోర్డ్ పై పావులు కదిలించి లాంఛనంగా టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ చదరంగం క్రీడ మేధాశక్తిని పదును పెడుతుందన్నారు. విద్యార్థులలో ఏకాగ్రతను ఇనుమడింప చేస్తుందన్నారు. క్రీడల ద్వారా గెలుపు, ఓటములను స్వీకరించే ఆత్మస్థైర్యం పెరుగుతుందని అన్నారు. గెలిచినవారు మళ్లీ గెలవాలని, ఓటమి చెందిన వారు నిరంతర సాధన ద్వారా భవిష్యత్తులో గెలుపు సాధించడానికి కృషి చేయాలని కోరారు. రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీలలో నంద్యాల జిల్లా తరపున పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సత్యసాయి జిల్లా క్రీడా అధికారి కిషోర్, సత్య సాయి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మణికంఠ రెడ్డి, జిల్లా చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రాజా రమేష్ చక్రవర్తి, కోశాధికారి శ్రీనిష్ ,క్రీడాకారులు వారి శిక్షకులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# డ్రోన్ ద్వారా బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తుల అరెస్ట్

### ఆళ్లగడ్డ టౌన్ ఇన్స్పెక్టర్ యుగంధర్



**నంద్యాల క్రైం, ఫిబ్రవరి 8 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా పోలీసులు నేరాల నియంత్రణలో భాగంగా బహిరంగ మద్యపానాన్ని కట్టడి చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్ల సహాయంతో, వివిధ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వ్యక్తులను గుర్తించి అరెస్ట్ చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో ఆదివారం ఆళ్లగడ్డ పట్టణ పోలీసులు ఆళ్ళగడ్డ పట్టణ పరిధిలోని వివిధ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించేందుకు అవకాశం ఉన్న పలు ప్రాంతాలను డ్రోన్ లతో జల్లెడ పట్టారు. ఆళ్ళగడ్డ పట్టణం మార్కెట్ యార్డు సమీపంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న నలుగురు వ్యక్తులను ఆళ్లగడ్డ పోలీసులు డ్రోన్ ద్వారా గుర్తించి వెంటనే అక్కడికి పోలీసులను పంపి, వారిని పట్టుకుని బహిరంగంగా మద్యం సేవించడం నేరమని, ప్రజా భద్రతకు భంగం అని వారికి తెలిపి వారిపై బహిరంగ మద్యపానం చేసినందుకు కేసు నమోదు చేయడమైనది.

# జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లకు, నేరచరిత్ర కలిగిన వారికి కౌన్సిలింగ్

### నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలి

### చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి






**నంద్యాల క్రైం, ఫిబ్రవరి 8, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు వారి పోలీస్ స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న రౌడీ షీటర్లకు, నేరచరిత్ర గలవారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న రాదని మీపై నిరంతరం నిఘా ఉంటుందని,పోలీసుల మాటలను వినకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

# ది గెలివి వెంకటేశ్వర విద్యాలయం రజతోత్సవ (సిల్వర్ జూబ్లీ) వేడుకలలో పాల్గొన్న ఎన్ఎండి ఫిరోజ్







**నంద్యాల ఫిబ్రవరి 8 (రిపబ్లిక్ న్యూస్)** నంద్యాల పట్టణంలోని స్థానిక మున్సిపల్ టౌన్ హాల్ నందు ది గెలివి వెంకటేశ్వర విద్యాలయం రజతోత్సవ వేడుకలు (సిల్వర్ జూబ్లీ సెలెబ్రేషన్స్) అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. పాఠశాల స్థాపించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు

ఈ సందర్భంగా నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. గత 25 ఏళ్లుగా ది గెలివి వెంకటేశ్వర విద్యాలయం నంద్యాల పట్టణంలో నాణ్యమైన విద్యను అందిస్తూ, ఎంతోమంది ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడం అభినందనీయమని కొనియాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూనే, నైతిక విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. రజతోత్సవ సంబరాల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com